ఉత్తరం
TG TEL/25/A1234
www.kakatiyanews.com
# కాకతీయ
గురువారం, 27 ఆగస్టు 2026 | సంపుటి: 02 | సంచిక: 14 | పేజీలు: 6 | వెల: 5



## భూభారతి పేరుతో కాంగ్రెస్ సర్కార్ రియల్ ఎస్టేట్ దందా!

- 22ఏ భూములపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి
- కూకట్‌పల్లి, ఆరుట్లలో 60–70 శాతం మంది 22ఏ బాధితులే
- ధరణికి ముందున్న రికార్డులు పునరుద్ధరించి.. నిషేధిత భూములను ఫ్రీహోల్డ్ చేయాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** ‘ధరణి’ పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ‘భూభారతి’ పేరుతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు ఆరోపించారు.


........(తరువాయి 2లో)

- 2009లో చివరి నిమిషంలో బీఫాం చేజారింది.. 2012లో ఓడిపోయా!
- 2014లో టీడీపీ నుంచి గెలిచా.. కార్యకర్తల కోరికతో టీఆర్ఎస్‌లోకి
- కేసీఆర్ భోళాశంకరుడు.. కేటీఆర్, హరీశ్‌రావులతోనూ మంచి అనుబంధం
- పదేళ్లలో పరకాల నియోజకవర్గంలో రూ.2,500 కోట్లతో అభివృద్ధి
- “ఈసారి నా కోసం కాదు.. నన్ను నమ్ముకున్న కార్యకర్తల కోసం గెలవాలి”
- డిజిటల్ మీడియా ప్రతినిధులతో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చిట్‌చాట్

## ఆ అవమానం నా జీవితాన్నే మార్చేసింది

ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం ఇచ్చిన వద్దన్నా ఎమ్మెల్యేగానే గెలవాలన్న పంతంతో ముందుకెళ్లా

“ఒక అవమానం నా జీవితాన్నే మార్చేసింది. అప్పటివరకు నాకు రాజకీయాల్లోకి రావాలన్న ఆలోచనే లేదు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి వ్యాపారం, కాంట్రాక్టు రంగాల్లో స్థిరపడుతున్నా. కానీ ఒక ప్రజాప్రతినిధి ఇంటికి వెళ్లినప్పుడు ఎదురైన అవమానం నన్ను లోలోపల కుదిపేసింది. అదే రోజు నన్ను అవమానించిన కుటుంబంపైనే ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నా. ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం వచ్చినా వద్దన్నా. నాకు కావాల్సింది ప్రత్యక్ష రాజకీయాలు.. ఎమ్మెల్యేగా ప్రజల తీర్పు పొందడమే. 2009లో చివరి నిమిషంలో బీఫాం చేజారింది. 2012లో ఓడిపోయినా పట్టు వదల్లేదు. చివరకు 2014లో టీడీపీ నుంచి గెలిచా. ఆ తర్వాత కార్యకర్తల కోరిక మేరకు టీఆర్ఎస్‌లో చేరా. కేసీఆర్ సహకారంతో పదేళ్లలో పరకాల నియోజకవర్గానికి సుమారు రూ.2,500 కోట్ల అభివృద్ధి పనులు తీసుకొచ్చా. ఈసారి నా కోసం కాదు.. నన్ను నమ్ముకున్న కార్యకర్తల కోసం గెలవాలి” అని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో తన కుటుంబం, వ్యక్తిగత జీవితం, వ్యాపార ప్రస్థానం, రాజకీయాల్లోకి వచ్చిన మలుపు, ఎన్నికల్లో ఎదురైన ఎత్తుపల్లాలు, చంద్రబాబు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులతో తన అనుబంధాన్ని చల్లా ధర్మారెడ్డి వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..!!



6

‘భూ భారతి’ మంత్రులకు

## వజ్రాల హారతి!

### 22ఏ భూముల పేరుతో లక్షల కోట్ల కుంభకోణం

- 2014కు ముందు..తర్వాత భూముల జాబితాపై శ్వేతపత్రం ఇవ్వాలి
- సెప్టెంబరు 5, 6న నిరసన దీక్షలు.. స్పందించకుంటే అసెంబ్లీ ముట్టడి
- బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** భూ భారతి, 22ఏ నిషేధిత భూముల జాబితాను అడ్డుపెట్టుకుని రాష్ట్రంలో భారీ అవకతవకలకు తెరతీశారని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ఎలాంటి కారణం లేకుండా కొన్ని భూములను 22ఏ జాబితా నుంచి తొలగించడం, మరికొన్ని భూములను కొత్తగా చేర్చడం ద్వారా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న భూ బదలాయింపులు, చీకటి ఒప్పందాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో

........(తరువాయి 2లో)

## హరికుమార్ అంటే హడలెందుకు?



- గతంలోనే కాంట్రాక్టర్ కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు!
- మెమో జారీ చేయాలన్న కలెక్టర్ నుంచి ఉన్నతాధికారులకు ఆదేశాలు
- విచారణకూ ముందుకు రాని బల్దియా ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు
- తాజాగా పనులు చేయకుండానే బిల్లుల వ్యవహారంలో చేతివాటం ఆరోపణలు
- రూ.5 లక్షల కమీషన్ ఫోన్‌పే వ్యవహారంపై కమిషనర్ వెంకన్న దృష్టి

3

## కాంగ్రెస్‌లో ఉత్కంఠ

### సురేఖపై ఎటు తేల్చని పార్టీ అధిష్ఠానం

- సుస్మిత వ్యాఖ్యలపై సీఎం రేవంత్ రాజీలేని వైఖరి
- ఎమ్మెల్యేలతో ప్రెస్‌మీట్ పెట్టించినట్లు పార్టీలో ప్రచారం
- సీఎంకు మంత్రుల నుంచి మద్దతు కరవు.. భట్టితో మురళి భేటీపై భిన్నాభిప్రాయాలు
- బుధవారం చాంబర్‌లో రాజగోపాల్‌రెడ్డితో కలిసి సమావేశం
- సురేఖపై చర్యలు లేకుండా చూసేందుకు మురళి ప్రయత్నాలు?
- కూతురు వ్యాఖ్యలతో తమకేం సంబంధం లేదంటూ సర్దిచెప్పే యత్నం
- ఖర్గేను కలిసేందుకు బెంగళూరుకు భట్టి.. జాతీయ అధ్యక్షుడితో భేటీపై ఉత్కంఠ
- సురేఖను మంత్రివర్గం నుంచి తొలగిస్తారని ప్రచారం.. విజయశాంతి పేరు తెరపైకి
- కుమార్తెకు మంత్రి పదవి కోసం కేకే ప్రయత్నాలు?
- అంతుచిక్కని అధిష్ఠానం ఆలోచనలు

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :**

కొండా సురేఖ-సుస్మిత ఘటనలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజీలేని వైఖరితో ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారాన్ని తేలిగ్గా తీసుకోకుండా.. పార్టీ పరంగా గట్టి సమాధానం ఇవ్వాలన్న ఉద్దేశంతో సీఎం ముందుకు వెళ్తున్నట్లు చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఎమ్మెల్యేలతో ప్రెస్‌మీట్ పెట్టించినట్లు సీఎం-సలహాదారు వేం నరేందర్‌రెడ్డి వర్గంలో ప్రచారం జరుగుతోంది. అయితే మరోవైపు ముఖ్యమంత్రికి మంత్రుల నుంచి ఆశించిన స్థాయిలో మద్దతు లభించకపోవడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. సుస్మిత వ్యాఖ్యల నేపథ్యంలో సీఎం వైఖరి ఒకలా ఉంటే.. మంత్రుల వ్యవహారశైలి మరోలా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాల మధ్య కొండా మురళి ముఖ్య నేతలను కలిసే ప్రయత్నాలు చేస్తున్నట్లు పార్టీలో ప్రచారం జరుగుతోంది. కొండా సురేఖపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా చూడటమే లక్ష్యంగా ఆయన మంతనాలు సాగిస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను

........(తరువాయి 2లో)



### కాంగ్రెస్‌లోనే ఉంటాం.. పార్టీ వీడే ప్రసక్తే లేదు

- అధిష్ఠానంపై పూర్తి విశ్వాసం..
- సోనియా, రాహుల్, ప్రియాంక నాయకత్వంలోనే ముందుకు
- సుస్మిత వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదు
- క్రమశిక్షణ కమిటీ నిర్ణయానికి కట్టుబడి ఉంటాం
- సీనియర్ నేత కొండా మురళి

2



డిసెంబరులో

### ‘ఖేలో ఇండియా యూత్ గేమ్స్’

- హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ వేదికలుగా పోటీలు
- రూ.22 కోట్లు విడుదల చేసిన కేంద్రం
- 6 వేల మందికిపైగా క్రీడాకారుల రాక : కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి



3

అత్యాచారం కేసులో

తేజ్‌పాల్‌కు సుప్రీంకోర్టులో

### ఎదురుదెబ్బ

- లొంగిపోవడం నుంచి మినహాయింపు కోరిన పిటిషన్ తిరస్కరణ
- రెండు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశం
- 2013 నాటి అత్యాచారం కేసులో దోషిగా తేలిన మాజీ తెహెల్కా ఎడిటర్



3

భూముల కేంద్రంగా

## రేవంత్ పాలన

### ప్రభుత్వ భూములు అమ్ముకోవడమే సర్కారు లక్ష్యం

- సామాన్యుల భూములకు 22ఏ ఆంక్షలు
- ప్రభుత్వ భూములపై మాత్రం కన్ను
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు
- రూ.30 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు విక్రయించారని ఆరోపణ

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** కేసీఆర్ హయాంలో ప్రజలే కేంద్రంగా పాలన సాగితే.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భూములే కేంద్రంగా పాలన సాగిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వ ఆస్తులు, భూములను అమ్ముకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఏకైక లక్ష్యంగా మారిందని ఆరోపించారు. సామాన్యులు కష్టపడి కొనుగోలు చేసిన భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి వేధిస్తున్న ప్రభుత్వం.. విలువైన ప్రభుత్వ భూములను మాత్రం సీఎం బంధువులు, అనుయాయులకు దారాదత్తం చేస్తోందని ఆరోపించారు. కూకట్‌పల్లి పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ

........(తరువాయి 2లో)



### మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

- 40 మంది కుటుంబాలకు డెత్ గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ ఇవ్వాలి
- 3,000 మంది ఉపాధ్యాయులకు ఐదు డీఏలు పెండింగ్
- ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీస్తాం
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు

5

## కీలక ఖనిజాల వైపు సింగరేణి పరుగులు

- నైనీ స్ఫూర్తితో.. దేవదుర్గపై ప్రత్యేక దృష్టి
- బంగారం, రాగి అన్వేషణ పనులు వేగవంతం చేయాలి
- వనాడియం, టైటానియం బ్లాకుల వేలంపైనా దృష్టి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** బొగ్గు మైనింగ్‌కే పరిమితం కాకుండా కీలక, వ్యూహాత్మక ఖనిజాల రంగంలోకి సింగరేణిని విస్తరించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. కర్ణాటకలో సింగరేణి దక్కించుకున్న దేవదుర్గ బంగారం, రాగి ఖనిజ అన్వేషణ బ్లాక్‌లో పనులను వేగవంతం చేయాలని సూచించారు. దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ మైనింగ్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని దిశానిర్దేశం చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో బుధవారం సింగరేణి నూతన



ప్రాజెక్టులు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై సంస్థ ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. దేవదుర్గ బంగారం,

........(తరువాయి 2లో)

## షీర్ జోన్లను దాటుతున్న ఎస్ఎల్‌బీసీ



- ప్రమాదకర ప్రాంతంలోనూ కొనసాగుతున్న టన్నెల్ తవ్వకాలు
- ఇప్పటివరకు 515 మీటర్ల మేర పనులు పూర్తి
- జపాన్ నుంచి తెప్పించిన త్రీఆర్ బూమర్ మిషన్‌తో వేగం
- 2028 మే నాటికి టన్నెల్ పూర్తి చేసే లక్ష్యం

5

# కాంగ్రెస్‌లో ఉత్కంఠ

(మొదటిపేజీ తరువాయి)

కలిసేందుకు మురళి ప్రయత్నించినట్లు సమాచారం. అయితే తొలుత మురళిని కలిసేందుకు భట్టి ససేమిరా అన్నట్లు పార్టీలో ప్రచారం జరిగింది. దీంతో ఈ వ్యవహారం మరింత ఆసక్తిని రేపింది.



**భట్టితో కొండా మురళి భేటీ**

అయితే బుధవారం పరిణామాలు అనూహ్యంగా మారాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన చాంబర్‌లో కొండా మురళితో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది. తొలుత కలిసేందుకు విముఖత చూపిన భట్టి.. ఆ తర్వాత మురళితో సమావేశం కావడం వెనుక కారణాలేంటన్నది ఇప్పుడు పార్టీలో చర్చగా మారింది. ముఖ్యంగా కొండా సురేఖపై చర్యలు తీసుకోకుండా చూడాలన్న మురళి ప్రయత్నాల్లో భాగంగానే ఈ భేటీ జరిగిందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సురేఖపై చర్యలు తీసుకోకుండా చూసేందుకు కొండా వర్గం నుంచి సర్దిచెప్పే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రచారం. సుస్మిత చేసిన వ్యాఖ్యలతో కొండా సురేఖకు ఎలాంటి సంబంధం లేదని వివరించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. కూతురు చేసిన వ్యాఖ్యల కారణంగా తల్లిపై చర్యలు తీసుకోవడం సరికాదన్న వాదనను కొండా మురళి ముఖ్య నేతల వద్ద వినిపిస్తున్నట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే భట్టితో మురళి సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఖర్గేను కలిసేందుకు బెంగళూరుకు భట్టి**

ఇదే సమయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసేందుకు వెళ్లడం తెలంగాణ రాజకీయాల్లో ఉత్కంఠ పెంచింది. కొండా మురళితో భేటీ జరిగిన నేపథ్యంలోనే భట్టి ఢిల్లీ పర్యటనకు వెళ్లడం మరింత ఆసక్తిని రేపింది. జాతీయ అధ్యక్షుడితో భట్టి ఏం చర్చించబోతున్నారు? తెలంగాణలో తాజాగా చోటుచేసుకున్న పరిణామాలను ఖర్గే దృష్టికి తీసుకెళ్లనున్నారా? అన్న దానిపై కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఒకవైపు ఈ పరిణామాలు కొనసాగుతుండగానే కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగిస్తారంటూ ప్రచారం జోరందుకుంది. సుస్మిత వ్యాఖ్యల నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పార్టీలోని కొన్ని వర్గాలు చెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే తుది నిర్ణయం మాత్రం కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకోవాల్సి ఉంది. దీంతో సురేఖ మంత్రి పదవిలో కొనసాగుతారా? లేదా అన్నది ప్రస్తుతం పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

**విజయశాంతి పేరు తెరపైకి**

సురేఖను మంత్రి పదవి నుంచి తొలగిస్తారన్న ప్రచారానికి తోడు.. ఆమె స్థానంలో విజయశాంతికి అవకాశం కల్పిస్తారంటూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చక్కర్లు కొడుతున్నాయి. మంత్రివర్గంలో సురేఖ స్థానాన్ని విజయశాంతితో భర్తీ చేస్తారంటూ జరుగుతున్న ప్రచారం కాంగ్రెస్ రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. అయితే దీనిపై ఎలాంటి అధికారిక నిర్ణయం వెలువడలేదు. కేవలం సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంగానే ఇది కొనసాగుతోంది. మరోవైపు సీనియర్ నేత కే.కేశవరావు తన కుమార్తెకు మంత్రివర్గంలో అవకాశం కల్పించాలంటూ ఢిల్లీ అధిష్ఠానం వద్ద గట్టి ప్రయత్నాలు చేస్తున్నారన్న ప్రచారం కూడా జరుగుతోంది. సురేఖ స్థానంలో మార్పు జరిగితే.. ఆ అవకాశాన్ని తన కుమార్తెకు దక్కించుకునేందుకు కేకే ప్రయత్నిస్తున్నారన్న చర్చ పార్టీలో వినిపిస్తోంది. ఈ ప్రచారం కూడా ప్రస్తుతం కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

**అధిష్ఠానం ఆలోచన ఏంటి?**

ఒకవైపు సీఎం రేవంత్‌రెడ్డి రాజీలేని వైఖరితో ఉన్నారన్న ప్రచారం.. మరోవైపు కొండా మురళి చర్యలు తీసుకోకుండా చూడాలని చేస్తున్న ప్రయత్నాలు.. భట్టి విక్రమార్కతో ఆయన భేటీ.. ఆ వెంటనే భట్టి ఖర్గేను కలిసేందుకు వెళ్లడం.. మరోవైపు సురేఖకు ఉద్వాసన ప్రచారం.. ఆమె స్థానంలో విజయశాంతి పేరు.. కేకే తన కుమార్తె కోసం ప్రయత్నిస్తున్నారన్న చర్చ.. ఇలా పరిణామాలు వరుసగా మారుతున్నాయి. చివరకు సురేఖపై సీఎం వైఖరే పైచేయి సాధిస్తుందా? కొండా వర్గం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తాయా? భట్టి-ఖర్గే భేటీ తర్వాత ఏమైనా నిర్ణయం వెలువడుతుందా? సురేఖ మంత్రి పదవిలో కొనసాగుతారా? లేక మార్పు జరుగుతుందా? అన్నదానిపై ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్‌లో ఉత్కంఠ నెలకొంది. అధిష్ఠానం ఆలోచన ఏమిటన్నది మాత్రం అంతుచిక్కకుండా ఉంది.

---

## కాంగ్రెస్‌లోనే ఉంటాం.. పార్టీ వీడే ప్రసక్తే లేదు

- అధిష్ఠానంపై పూర్తి విశ్వాసం..
- సోనియా, రాహుల్, ప్రియాంక నాయకత్వంలోనే ముందుకు
- సుస్మిత వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదు
- క్రమశిక్షణ కమిటీ నిర్ణయానికి కట్టుబడి ఉంటాం
- సీనియర్ నేత కొండా మురళి

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ కాంగ్రెస్‌లో తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ భర్త, సీనియర్ నేత కొండా మురళి కీలక వ్యాఖ్యలు చేశారు. తాము ఎప్పటికీ కాంగ్రెస్ పార్టీలోనే ఉంటామని, పార్టీని వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పార్టీ అధిష్ఠానంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల నాయకత్వంలోనే ముందుకు సాగుతామని తెలిపారు. ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలతో కొండా మురళి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తమ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని కొండా మురళి తెలిపారు. ఆమె ప్లాన్-ఎ ప్రకారమే మాట్లాడిందని పేర్కొన్నారు. అయితే ప్లాన్-బి ఏమిటనేది తనకు తెలియదని వ్యాఖ్యానించారు.

**క్రమశిక్షణ కమిటీ నిర్ణయమే కీలకం**

ప్రస్తుతం మంత్రి కొండా సురేఖ అధికారిక కార్యక్రమాల్లో బిజీగా పాల్గొంటున్నారని మురళి తెలిపారు. మంగళవారం వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. బుధవారం కూడా పలు ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరయ్యారని చెప్పారు. కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ నిర్ణయం వెలువడే వరకు ఈ అంశంపై తాను మరేమీ మాట్లాడబోనని స్పష్టం చేశారు. క్రమశిక్షణ కమిటీ తీసుకునే నిర్ణయానికి తాము కట్టుబడి ఉంటామని కొండా మురళి తేల్చిచెప్పారు.

---

## 'భూ భారతి' మంత్రులకు వజ్రాల హారతి!

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించిన మీడియా సమావేశంలో మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో 'ధరణి' పేరుతో దోపిడీ జరిగిందని విమర్శించిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు అదే విధానాన్ని 'భూ భారతి' పేరుతో కొనసాగిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. 22ఏ జాబితా మార్పులు, భూముల బదలాయింపులపై ప్రభుత్వం పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచాలని కోరారు.

**రాహుల్‌గాంధీకి బహిరంగ లేఖ**

భూ భారతి, 22ఏ భూముల వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి తెలుగు, ఇంగ్లిష్‌లో బహిరంగ లేఖ విడుదల చేసినట్లు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. కేవలం రాజ్యాంగ పుస్తకం పట్టుకుని తిరగడం కాకుండా తెలంగాణలో జరుగుతున్న భూ వ్యవహారాలపై కూడా రాహుల్‌గాంధీ స్పందించాలని అన్నారు. 2014కు ముందు, ఆ తర్వాత ఉన్న 22ఏ భూముల జాబితాపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భూముల బదలాయింపులు, షెల్ కంపెనీల లావాదేవీలపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో సమగ్ర దర్యాప్తు, ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని కోరారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన బినామీ, షెల్ కంపెనీలకు సుమారు రూ.15 వేల కోట్ల విలువైన ఆస్తులు అక్రమంగా బదలాయించారని మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. క్యాబినెట్ మంత్రిగా ఉంటూ సొంత కంపెనీలకు లబ్ధి చేకూర్చుకోవడం దారుణమన్నారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని, పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం నుంచి ప్రతి నెలా రూ.200 కోట్లు ఢిల్లీకి రాహుల్‌గాంధీకి ముడుపులుగా వెళ్తున్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే బహిరంగంగా ఆరోపిస్తున్నారని, దీనిపైనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.

**ఐదో తేదీ నుంచి దీక్షలు**

భూ భారతి 22ఏ అంశంపై గత నెల రోజులుగా కొనసాగుతున్న పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని నిర్ణయించినట్లు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. సెప్టెంబరు 5, 6 తేదీల్లో ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, 22ఏ జాబితాలో భూములు చేరిన బాధితులతో కలిసి పెద్ద ఎత్తున నిరసన దీక్షలు చేపడతామని ప్రకటించారు. ఈ దీక్షలకు ప్రభుత్వం స్పందించి భూ భారతి, 22ఏ సమస్యలపై చర్యలు తీసుకోకపోతే తదుపరి దశలో 'అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమాల్లో బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ ప్రజల పక్షాన పోరాటం చేయాలని మహేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు.

---

## కీలక ఖనిజాల వైపు సింగరేణి పరుగులు

(మొదటిపేజీ తరువాయి)

రాగి ఖనిజ అన్వేషణ బ్లాక్‌పై ప్రత్యేకంగా చర్చించారు. ఇప్పటివరకు చేపట్టిన పనులు, భౌగోళిక పరిస్థితులు, ఖనిజ నిక్షేపాల అన్వేషణకు తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి, డైరెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, తిరుమలరావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.



**దేవదుర్గపై ప్రత్యేక దృష్టి**

దేవదుర్గ బ్లాక్‌లో అన్వేషణ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని భట్టి విక్రమార్క సూచించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను స్వయంగా అధ్యయనం చేసేందుకు గురువారం సింగరేణి ఉన్నతాధికారులతో కలిసి దేవదుర్గ బ్లాక్‌ను సందర్శించనున్నట్లు తెలిపారు. ఖనిజ అన్వేషణకు అవసరమైన అనుమతులు, మౌలిక సదుపాయాలు, ఇతర అంశాల్లో కర్ణాటక ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం తీసుకుంటామని చెప్పారు. దేవదుర్గ ప్రాజెక్టును విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడం ద్వారా బొగ్గు నుంచి కీలక, వ్యూహాత్మక ఖనిజాల రంగంలోకి సింగరేణి విస్తరణకు బలమైన పునాది పడుతుందని పేర్కొన్నారు. తెలంగాణకు గుండెకాయలాంటి సింగరేణిని మరింత లాభదాయకంగా తీర్చిదిద్ది భవిష్యత్ తరాలకు బలమైన సంస్థగా అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే బొగ్గు, కీలక ఖనిజాల వేలం ప్రక్రియలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి సింగరేణికి అనుకూలమైన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. త్వరలో వనాడియం, టైటానియం వంటి కీలక ఖనిజ బ్లాకులు వేలానికి వచ్చే అవకాశం ఉన్నందున వాటిని దక్కించుకునేందుకు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణతో సిద్ధం కావాలని సూచించారు. కాపర్, గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాలకు భవిష్యత్‌లో పెరగనున్న ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని కొత్త అవకాశాలను గుర్తించాలని చెప్పారు. దక్షిణాఫ్రికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, చిలీ తదితర దేశాల్లో ఖనిజ అవకాశాలను అధ్యయనం చేసేందుకు అంతర్జాతీయ కన్సల్టెంట్లను నియమించినట్లు తెలిపారు.

**బొగ్గు ఉత్పత్తి కూడా పెంచాలి**

కీలక ఖనిజాల రంగంలో విస్తరిస్తూనే సింగరేణి ప్రధాన కార్యకలాపమైన బొగ్గు ఉత్పత్తిపైనా ప్రత్యేక దృష్టి కొనసాగించాలని భట్టి విక్రమార్క సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో డిమాండ్‌కు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్, ఇంధన భద్రతకు మరింత ప్రాధాన్యం ఏర్పడిందని, ఈ విషయంలో సింగరేణి కీలక పాత్ర పోషించాలని అన్నారు. బొగ్గు ఉత్పత్తిలో సంస్థకున్న అనుభవాన్ని ఉపయోగించుకుంటూనే కీలక ఖనిజాల రంగంలోనూ దేశంలో అగ్రగామి సంస్థగా సింగరేణిని తీర్చిదిద్దేందుకు పటిష్ఠమైన కార్యాచరణతో ముందుకు సాగాలని భట్టి విక్రమార్క అధికారులకు దిశానిర్దేశం చేశారు.

---

## నేపాల్‌లో ఆకస్మిక వరదలు.. భారీ విధ్వంసం

- 750 మందికి పైగా గల్లంతు.. 133 మంది భారతీయులు
- రసువా, ధాడింగ్, నువాకోట్ జిల్లాల్లో తీవ్ర నష్టం
- 13 జలవిద్యుత్ ప్రాజెక్టులు, రహదారులు, వంతెనలు ధ్వంసం
- భారత రాయబార కార్యాలయం హెల్ప్‌లైన్.. 10 టన్నుల సాయం

**నేపాల్ :** నేపాల్-టిబెట్ సరిహద్దుల్లో ఆకస్మికంగా సంభవించిన మెరుపు వరదలు పెను విధ్వంసం సృష్టించాయి. బుధవారం ఉదయం భోటేకోశీ నదికి ఒక్కసారిగా భారీగా వరద పోటెత్తడంతో రసువా, ధాడింగ్, నువాకోట్ తదితర జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. వివిధ జిల్లాల్లో ఇప్పటివరకు 31 మంది మృతి చెందినట్లు నేపాల్ అధికారులు ధ్రువీకరించగా.. 750 మందికి పైగా గల్లంతైనట్లు సమాచారం. గల్లంతైన వారిలో 133 మంది భారతీయులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. నేపాల్-టిబెట్ సరిహద్దులోని రసువాగఢికి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో కొండచరియలు విరిగిపడటంతోనే ఈ విపత్తు సంభవించినట్లు ప్రాథమిక నివేదికలు, శాటిలైట్ చిత్రాల ఆధారంగా అధికారులు గుర్తించారు. లెంధే నది ఉప్పొంగి వరద నీరు భోటేకోశీ మీదుగా త్రిశూలి నదిలోకి ప్రవేశించడంతో వరద తీవ్రత పెరిగింది.

**750 మందికి పైగా గల్లంతు**

వరదల్లో గల్లంతైన వారిలో 133 మంది భారతీయులు, 37 మంది ఎన్నారైలు ఉన్నారు. భారతీయుల్లో కనీసం 59 మంది కైలాస మానససరోవర్ యాత్రకు వెళ్తున్న వారని సామ్రాట్ టూర్స్ అండ్ ట్రావెల్ ఏజెన్సీ తెలిపింది. 44 మంది నేపాల్ ఆర్మీ సిబ్బందితో పాటు మొత్తం 80 మంది భద్రతా సిబ్బంది కూడా గల్లంతైనట్లు సమాచారం. గల్లంతైన వారి కోసం నేపాల్ ఆర్మీ హెలికాప్టర్లు, విపత్తు నిర్వహణ బృందాలతో గాలింపు చర్యలు చేపట్టింది. 12 హెలికాప్టర్లు, డ్రోన్లు, స్నిఫర్ డాగ్స్‌ను రంగంలోకి దించి ఇప్పటివరకు సుమారు 80 మందిని రక్షించినట్లు అధికారులు తెలిపారు. భోటేకోశీ, త్రిశూలి నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. వరద ఉద్ధృతికి సుమారు 42 కిలోమీటర్ల మేర రహదారులు కొట్టుకుపోయాయి. 13 జలవిద్యుత్ ప్రాజెక్టులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆరు ప్రధాన విద్యుత్ కేంద్రాలు, ట్రాన్స్‌మిషన్ లైన్లు దెబ్బతినడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వరద ప్రవాహంలో అనేక వాహనాలు కొట్టుకుపోగా.. రసువా కస్టమ్స్ కార్యాలయ ప్రాంగణంలోని విలువైన సరుకులు కూడా నీటిపాలయ్యాయి. ఇటీవల నిర్మించిన ఓ వంతెన సైతం వరద ధాటికి కొట్టుకుపోయింది. కీలక రహదారులు దెబ్బతినడంతో పలు ప్రాంతాల్లో రాకపోకలు స్తంభించిపోయాయి.

**భారత్ నుంచి 10 టన్నుల అత్యవసర సామగ్రి**

విపత్తు తీవ్రతపై నేపాల్ ప్రధాని బాలేంద్ర షా జాతీయ విపత్తు నిర్వహణ సంస్థతో అత్యవసర సమావేశం నిర్వహించారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని, వైద్య బృందాలు, స్కౌట్స్, రెడ్‌క్రాస్ సంస్థలతో సమన్వయం చేసుకుని బాధితులకు తక్షణ సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. భారత్ కూడా నేపాల్‌కు అత్యవసర సహాయాన్ని అందించింది. విమానం ద్వారా 10 టన్నుల అత్యవసర, సహాయ సామగ్రిని పంపించింది. ఇందులో ఔషధాలు, గుడారాలు, దుప్పట్లు, సోలార్ లైట్లు తదితర వస్తువులు ఉన్నాయి. నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం బాధిత భారతీయుల కోసం +977 985 131 6807, +977 970 910 7500 హెల్ప్‌లైన్ నంబర్లను అందుబాటులోకి తెచ్చింది. నేపాల్ పర్యాటక బోర్డు కూడా 1234 టోల్‌ఫ్రీ నంబర్, 1144 హాట్‌లైన్, పర్యాటక పోలీసుల 9851289445 నంబర్లను ప్రకటించింది. మరోవైపు నేపాల్ వరదల నేపథ్యంలో గండక్ నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేంద్రం బిహార్, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వాలకు సూచించింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా బిహార్ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరీతో పరిస్థితిపై మాట్లాడారు.

---

# భూభారతి పేరుతో కాంగ్రెస్ సర్కార్ రియల్ ఎస్టేట్ దందా!

(మొదటిపేజీ తరువాయి)

1908 రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏను అడ్డుపెట్టుకుని పేద, మధ్యతరగతి ప్రజల భూములను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. 22ఏ నిషేధిత భూముల వ్యవహారంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో తక్షణమే న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కూకట్‌పల్లి, రంగారెడ్డి జిల్లాలకు చెందిన కాలనీల అసోసియేషన్ అధ్యక్షులు, 22ఏ బాధితులు రాంచందర్‌రావును కలిసి తమ సమస్యలను వివరించారు. కూకట్‌పల్లి వసంత్‌నగర్‌లో మధ్యతరగతి కుటుంబాలు కొనుగోలు చేసిన ఫ్లాట్లు, ఆరుట్ల గ్రామంలోని దాదాపు 1,100 ఎకరాల సాధారణ భూములు 22ఏ నిషేధిత జాబితాలోకి చేరడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారు**

హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల్లో 60 నుంచి 70 శాతం మంది ప్రజలు 22ఏ సమస్యతో ప్రత్యక్షంగా ఇబ్బందులు పడుతున్నారని రాంచందర్‌రావు అన్నారు. డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్లు పూర్తిచేసుకున్న భూములను సైతం ప్రొహిబిటెడ్ లిస్టులో చేర్చి ఎన్‌వోసీల కోసం ప్రజలను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని ఆరోపించారు. ఎన్నిసార్లు దరఖాస్తులు చేసుకున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుల భూములను సైతం 22ఏలో చేర్చారంటే పరిస్థితి తీవ్రత అర్థమవుతోందని పేర్కొన్నారు.

**ప్రజల భూములను వేలం వేసి ఖజానా నింపుకుంటారా?**

ప్రైవేట్ భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి, అనంతరం వాటిని ప్రభుత్వ భూములుగా చూపించి వేలం వేయడం ద్వారా ఖజానా నింపుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యంగా మారిందని రాంచందర్‌రావు ఆరోపించారు. ప్రభుత్వాలు ప్రజాస్వామ్యబద్ధంగా పాలన సాగించాలే తప్ప రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయకూడదని హెచ్చరించారు. 2018 ధరణి నుంచి 2025-26 భూభారతి వరకు జరిగిన భూ లావాదేవీలు, 22ఏ నిషేధిత భూముల వెనుక ఉన్న వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని కోరారు. ధరణికి ముందు ఉన్న భూ రికార్డులను యథాతథంగా కొనసాగించాలని రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చిన ప్రైవేట్, సాధారణ ప్రజల భూములను తక్షణమే తొలగించి ఫ్రీహోల్డ్ చేయాలని కోరారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా రెవెన్యూ యంత్రాంగానికి ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని అన్నారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ కాంగ్రెస్‌కు వత్తాసు పలుకుతూ వీర సావర్కర్ వంటి మహనీయులపై అసత్య ప్రచారం చేస్తున్నారని రాంచందర్‌రావు విమర్శించారు. కాంగ్రెస్, ఎంఐఎంల మధ్య ఉన్న రహస్య బంధాన్ని ప్రజలు గమనిస్తున్నారని, ప్రజా సమస్యలపై బీజేపీ రాజీలేని పోరాటం చేస్తుందని ఆయన హెచ్చరించారు.



---

# భూముల కేంద్రంగా రేవంత్ పాలన

(మొదటిపేజీ తరువాయి)

ఎన్ఆర్ఎస్ఏ కమ్యూనిటీ హాల్‌లో 22ఏ నిషేధిత భూముల సమస్యతో ఇబ్బందులు పడుతున్న బాధిత కుటుంబాలతో హరీశ్‌రావు సమావేశమయ్యారు. స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్న హరీశ్‌రావు.. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

**ప్రజల సమస్యలను పక్కనపెట్టి భూముల చుట్టూ తిరుగుతున్నారు**

ప్రభుత్వ బాధ్యత ప్రజలకు విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, రవాణా, ఉద్యోగాలు, రైతుల సంక్షేమం కల్పించడమని హరీశ్‌రావు అన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఈ సమస్యలను పక్కనపెట్టి కేవలం భూముల చుట్టూనే తిరుగుతోందని విమర్శించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజలే కేంద్రంగా పరిపాలన సాగిందని, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత భూములే కేంద్రంగా పాలన సాగుతోందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో హైదరాబాద్ సహా రాష్ట్రంలో తాగునీరు, విద్యుత్, సాగునీరు, ట్రాఫిక్ వంటి సమస్యలకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కారాలు చూపించామని తెలిపారు. కూకట్‌పల్లిలోనూ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం వందల కోట్ల రూపాయలు వెచ్చించి రిజర్వాయర్లు, పైప్‌లైన్లు, మౌలిక వసతులు ఏర్పాటు చేశామని చెప్పారు. నగరంలో టిమ్స్ ఆసుపత్రులు, కూకట్‌పల్లిలో 20కిపైగా బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

**రూ.30 వేల కోట్ల భూములు అమ్మేశారని ఆరోపణ**

ప్రస్తుత ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కంటే ప్రభుత్వ భూముల విక్రయానికే ప్రాధాన్యత ఇస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. హౌసింగ్ బోర్డు, టీజీఐఐసీకి చెందిన భూములు ఎక్కడ కనిపించినా విక్రయానికి పెడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో హౌసింగ్ బోర్డుకు చెందిన ఒక్క గజం భూమిని కూడా అమ్మలేదని, రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు రూ.30 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు విక్రయించారని ఆరోపించారు. హైదర్‌నగర్‌లో పిల్లలు ఆడుకునేందుకు కేసీఆర్ ప్రభుత్వం కేటాయించిన పార్కు స్థలాన్ని కూడా రేవంత్ సర్కారు అమ్మకానికి పెట్టిందని విమర్శించారు. ప్రభుత్వ భూములు భవిష్యత్ తరాల ఆస్తులని, వాటిని అమ్మడానికి కాదని అన్నారు. ఇలా భూములన్నీ విక్రయిస్తే భవిష్యత్తులో పాఠశాలలు, ఆసుపత్రులు, దేవాలయాలు, వాటర్ ట్యాంకులు, వైకుంఠధామాల నిర్మాణానికి కూడా స్థలాలు దొరకని పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

**22ఏ బాధితులకు అండగా ఉంటాం**

దళితులు, గిరిజనులు, బీసీలకు గతంలో కేటాయించిన అసైన్డ్ భూములపైనా ప్రభుత్వం కన్నేసిందని హరీశ్‌రావు ఆరోపించారు. పేదలకు భరోసాగా ఉన్న ఆ భూములను దళారుల ద్వారా కమీషన్లకు కట్టబెడుతున్నారని విమర్శించారు. మరోవైపు కష్టపడి సంపాదించిన డబ్బుతో కొనుగోలు చేసిన సామాన్యుల భూములను రాత్రికి రాత్రే 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్తులైన విలువైన భూములను మాత్రం సీఎం కుటుంబ సభ్యులు, అనుయాయులకు కారుచౌకగా దారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విధానాలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోందని, 22ఏ బాధితుల పక్షాన, సామాన్యుల ఆస్తుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తామని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

---

## చికెన్ ధరలు భారీగా డౌన్!

**కాకతీయ, హైదరాబాద్ :** చికెన్ ధరలు భారీగా తగ్గాయి. గత నెలలో కిలో చికెన్ ధర రూ.340 వరకు చేరగా.. ప్రస్తుతం రూ.220 స్థాయికి పడిపోయింది. శ్రావణ మాసం నేపథ్యంలో చాలామంది మాంసాహారానికి దూరంగా ఉండటంతో చికెన్‌కు డిమాండ్ తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు సరఫరా అధికంగా ఉండటంతో ధరలు మరింత దిగొచ్చాయని పేర్కొంటున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.222, డ్రెస్డ్ చికెన్ రూ.197గా ఉంది. ఫారం వద్ద లైవ్ బర్డ్ ధర రూ.100 కాగా.. రిటైల్‌లో రూ.127గా కొనసాగుతోంది. కరీంనగర్ జోన్‌లోనూ ఇవే ధరలు నమోదవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడలో కిలో స్కిన్‌లెస్ చికెన్ రూ.240, డ్రెస్డ్ చికెన్ రూ.212గా ఉంది. ఫారం వద్ద లైవ్ బర్డ్ రూ.110, రిటైల్‌లో రూ.137గా ఉంది. శ్రావణ మాసం కారణంగా చికెన్ దుకాణాలకు వచ్చే కస్టమర్ల సంఖ్య తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో విక్రయాలు తగ్గి ఆదాయంపై ప్రభావం పడుతోందని పేర్కొంటున్నారు. రానున్న రోజుల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగితే చికెన్ ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

**గుడ్ల ధరలు ఇలా..**

కోడి గుడ్ల ధరలు మాత్రం ప్రస్తుతం స్థిరంగా ఉన్నాయి. హైదరాబాద్, కరీంనగర్ జోన్‌లో 12 గుడ్ల రిటైల్ ధర రూ.74గా ఉండగా.. విజయవాడలో రూ.75గా ఉంది. గత నెలలో ఒక్క గుడ్డు రూ.8 వరకు చేరగా.. ప్రస్తుతం రూ.6కు తగ్గింది. శ్రావణ మాసం నేపథ్యంలో చికెన్‌తో పాటు గుడ్లకు కూడా డిమాండ్ తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

# డిసెంబరులో 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'

- హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ వేదికలుగా పోటీలు
- రూ.22 కోట్లు విడుదల చేసిన కేంద్రం.. 6 వేల మందికిపైగా క్రీడాకారుల రాక
- కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి



కాకతీయ, న్యూఢిల్లీ : 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్' 8వ ఎడిషన్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ ఏడాది డిసెంబరులో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ వేదికలుగా క్రీడాపోటీలను నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. పోటీల నిర్వహణ కోసం కేంద్రం రూ.22 కోట్లు విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 6 వేల మందికిపైగా క్రీడాకారులు పాల్గొనే అవకాశం ఉందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ సమన్వయంతో రాష్ట్ర ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్), నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్లు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, సీబీఎస్ఈ, ఖేలో ఇండియా పథకం అడ్‌హక్ కమిటీ, స్టీరింగ్ కమిటీల సంయుక్త ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించనున్నారు. మొత్తం 25 క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నాయి. ఆతిథ్య రాష్ట్రం తరఫున ఒక స్థానిక క్రీడను ప్రతిపాదించుకునే అవకా శం ఉండగా.. మరో కొత్త క్రీడను కూడా ఈ ఎడిషన్‌లో చేర్చనున్నారు.

### తెలంగాణకు అవకాశం రావడం అభినందనీయం

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణకు తెలంగాణను ఎంపిక చేయడంపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ అవకాశం కల్పించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. దేశంలోని యువతలో అపారమైన క్రీడా ప్రతిభ ఉందని, దానిని వెలికితీసేందుకు కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియా వంటి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. తెలంగాణలో ఖేలో ఇండియా పథకం కింద దాదాపు రూ.30 కోట్లతో క్రీడా సదుపాయాలు కల్పించినట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో రూ.11.5 కోట్లతో సింథటిక్ ట్రాక్, సింథటిక్ టెన్నిస్ కోర్టు, మహిళలకు ప్రత్యేక స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలోని వివిధ పట్టణాల్లో మరో రూ.18.5 కోట్లతో క్రీడా సదుపాయాలు కల్పించినట్లు వివరించారు. తెలంగాణలో 33 ఖేలో ఇండియా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### క్రీడలకు పెరిగిన ప్రోత్సాహం

2014లో కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్రీడా బడ్జెట్‌ను పెంచడంతో పాటు క్షేత్రస్థాయిలో క్రీడా మౌలిక వసతులను అభివృద్ధి చేసిందని కిషన్‌రెడ్డి తెలిపారు. 2014కు ముందు రూ.1,219 కోట్లుగా ఉన్న క్రీడా బడ్జెట్ 2025–26లో రూ.3,794 కోట్లకు పెరిగిందన్నారు. 2014కు ముందు దేశంలో రూ.191 కోట్ల విలువైన 38 క్రీడా ప్రాజెక్టులు ఉండగా.. గత 12 ఏళ్లలో రూ.3,181 కోట్ల విలువైన 350 స్పోర్ట్స్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు పూర్తయ్యాయని చెప్పారు. ఖేలో ఇండియా, టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్(టాప్స్), నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్లకు సహాయం, సాయ్ పథకాలు క్రీడాకారులకు ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన బాక్సర్ నిఖత్ జరీన్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు వంటి వారికి కేంద్ర పథకాల ద్వారా అంతర్జాతీయ స్థాయి శిక్షణ, పోటీల్లో పాల్గొనే అవకాశం లభించిందన్నారు. 2014కు ముందు 23 ఒలింపిక్స్ ఎడిషన్లలో భారత్ 23 పతకాలు సాధించగా.. 2014 నుంచి 2024 వరకు మూడు ఎడిషన్లలో 15పతకాలు సాధించిందనితెలిపారు.పారాలింపిక్స్‌లో 2014కు ముందు 8 పతకాలు మాత్రమే సాధించగా.. 2014 నుంచి 2024 వరకు 52 పతకాలు సాధించినట్లు కిషన్‌రెడ్డి వివరించారు.

### నేడు 'ఖేల్ కీ బాత్.. పీఎం కే సాథ్'

జాతీయ క్రీడా దినోత్సవం ఆగస్టు 29న జరగనున్న నేపథ్యంలో గురువారం(ఆగస్టు 27) దేశవ్యాప్తంగా 'ఖేల్ కీ బాత్.. పీఎం కే సాథ్' పేరుతో ఖేలో ఇండియా సంవాద్ నిర్వహించనున్నారు. దేశంలోని ప్రతి జిల్లా నుంచి రెండు కాలేజీల చొప్పున 1,500కు పైగా కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ క్రీడలు, ఫిట్‌నెస్, యువత నేతృత్వంలో దేశ నిర్మాణం వంటి అంశాలపై వర్చువల్‌గా ప్రసంగించనున్నారు. యువత క్రీడలపై తమ ఆలోచనలు, ఆకాంక్షలను ప్రధానితో పంచుకునే అవకాశం కల్పించనున్నారు.

## హరికుమార్ అంటే హడలెందుకు?

- గతంలోనే కాంట్రాక్టర్ కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు!
- మెమో జారీ చేయాలన్న కలెక్టర్ నుంచి ఉన్నతాధికారులకు ఆదేశాలు
- విచారణకూ ముందుకు రాని బల్దియా ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు
- తాజాగా పనులు చేయకుండానే బిల్లుల వ్యవహారంలో చేతివాటం ఆరోపణలు
- రూ.5 లక్షల కమీషన్ ఫోన్‌పే వ్యవహారంపై కమిషనర్ వెంకన్న దృష్టి



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : వరంగల్ మహానగర పాలక సంస్థలో ఇంజినీరింగ్ అధికారి హరికుమార్ అంటే ఉన్నతాధికారులకు ఎందుకింత హడలన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఆయనపై గతంలోనే కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు రావడం.. దీనిపై హరికుమార్‌కు మెమో జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించినట్లు సమాచారం ఉన్నప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు లేకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కనీసం విచారణకు కూడా ముందు కు రాకపోవడం బల్దియా ఇంజినీరింగ్ విభాగంలో ఆయనకున్న పలుకుబడికి నిదర్శనమన్న చర్చ సాగుతోంది. ఇదిలా ఉండగానే తాజాగా అభివృద్ధి పనుల విషయంలోనూ ఆయనపై తీవ్ర ఆరోపణలు రావడం కలకలం రేపుతోంది.

### కలెక్టర్ ఆదేశాలూ బేఖాతరే?

హన్మకొండ ప్రాంతంలో ఇంజినీరింగ్ అధికారిగా పనిచేస్తున్న హరికుమార్‌పై గతంలో ఓ కాంట్రాక్టర్ కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ ఫిర్యాదును పరిశీలించిన అనంతరం హరికుమార్‌కు మెమో జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించినట్లు తెలుస్తోంది. అయితే ఆ ఆదేశాల మేరకు మెమో జారీ చేశారా? ఫిర్యాదుపై విచారణ చేపట్టారా? అన్నది ఇప్పటికీ స్పష్టత లేకుండా ఉంది. జిల్లా కలెక్టర్ స్థాయి నుంచి ఆదేశాలు వచ్చినా వాటిని అమలు చేయడంలో ఎందుకు జాప్యం జరుగుతోందన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఫిర్యాదులోని అంశాలు నిజమో కాదో తేల్చేందుకు విచారణ జరపాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా చర్యలు కనిపించకపోవడం చర్చకు దారితీస్తోంది.

### తాజాగా బిల్లుల వ్యవహారంలో ఆరోపణలు

గత వ్యవహారం మరుగునపడకముందే తాజాగా అభివృద్ధి పనులకు సంబంధించిన అంశంలో హరికుమార్‌పై మరోసారి ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనులు చేయకుండానే బిల్లులు పొందేందుకు ప్రయత్నాలు జరిగాయన్న విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంలో ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.5 లక్షలు ముందుగానే కమీషన్‌గా ఫోన్‌పే ద్వారా తీసుకున్నారన్న ఆరోపణలు కూడా ప్రచారంలోకి వచ్చాయి. అయితే ఈ ఆరోపణలకు అధికారిక నిర్ధారణ అవసరం. నిజంగా రూ.5 లక్షల లావాదేవీ జరిగిందా? జరిగితే ఎవరి ఖాతా నుంచి ఎవరి ఖాతాకు డబ్బు బదిలీ అయింది? సంబంధిత పనికి సంబంధించిన ఫైల్‌లో ఏం ఉంది? పనులు పూర్తయ్యాయా? బిల్లుల ప్రక్రియ ఎక్కడ ఉంది? వంటి అంశాలపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

### కమిషనర్ దృష్టికి వ్యవహారం

తాజా ఆరోపణల నేపథ్యంలో బల్దియా కమిషనర్ టి. వెంకన్న ఈ వ్యవహారంపై దృష్టి సారించినట్లు సమాచారం. హరికుమార్‌పై వచ్చిన ఆరోపణలను పరిశీలించి చర్యల అంశాన్ని చూడాలని సూపరింటెండింగ్ ఇంజినీర్‌ను ఆదేశించినట్లు తెలుస్తోంది. దీంతో ఈసారైనా వ్యవహారం విచారణ దశ దాటి చర్యల వరకు వెళ్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. గతంలో కలెక్టర్ ఆదేశాల అమలుపై స్పష్టత లేకపోవడం, తాజాగా కమిషనర్ స్థాయిలో దృష్టి సారించినట్లు సమాచారం రావడంతో బల్దియా వర్గాల్లో చర్చ మొదలైంది. ఆరోపణలు నిరాధారమైతే రికార్డులతో స్పష్టత ఇవ్వాలి.. నిజమైతే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. లేకపోతే ఒకే అధికారిపై వరుస ఆరోపణలు వచ్చినా ఉన్నతాధికారులు ఎందుకు వెనకడుగు వేస్తున్నారన్న అనుమానాలు మరింత బలపడే అవకాశం ఉంది.

## 27న పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ, వార్డు సభలు

- ఓటరు జాబితాలను ప్రజల సమక్షంలో చదివి వినిపించనున్న అధికారులు
- పేరు, చిరునామా వివరాలు సరిచూసుకునే అవకాశం
- కొత్త ఓటర్ల నమోదుకు నమూనా–6తో దరఖాస్తు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు



కాకతీయ, ములుగు ప్రతినిధి : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఆగస్టు 27న జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ, వార్డు సభలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. సభల్లో ఓటరు జాబితాలను ప్రజల సమక్షంలో చదివి వినిపిస్తారని పేర్కొన్నారు. పేరు, చిరునామా, ఇతర వివరాలను పరిశీలించుకోవచ్చన్నారు. కొత్తగా పేరు నమోదుకు నమూనా–6, తొలగింపు లేదా అభ్యంతరాలకు నమూనా–7, వివరాల సవరణకు నమూనా–8 వినియోగించాలని సూచించారు. ఆచూకీ లేని, ఇతర ప్రాంతాలకు వెళ్లిన, మరణించిన, రెండుచోట్ల నమోదైన ఓటర్ల వివరాలను కూడా పరిశీలనకు ఉంచుతామని తెలిపారు. అసంగత వివరాలున్న ఓటర్లకు నోటీసులు జారీ చేసి ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 20 వరకు విచారణ చేపడతామన్నారు. సందేహాలుంటే 1950 ఉచిత సహాయ సంఖ్యను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

## కాంగ్రెస్ 1000 రోజుల దగాపై బీఆర్ఎస్ సమరభేరి



- గ్రామగ్రామాన కాంగ్రెస్ మోసాన్ని ప్రజలకు వివరించాలి
- మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

కాకతీయ, వర్ధన్నపేట : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో ఆ పార్టీ హామీల అమలు వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ పార్టీ సమరభేరికి సిద్ధమైంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో వారం రోజుల పాటు నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. ఈ మేరకు వర్ధన్నపేట మున్సిపాలిటీ, మండల ముఖ్య నాయకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరూరి రమేష్ మాట్లాడుతూ 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా ఆ పార్టీ వైఫల్యాలను ప్రజల ముందుంచేందుకు బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా కార్యాచరణ చేపడుతోందన్నారు. ఇందులో భాగంగా వర్ధన్నపేట నియోజకవర్గంలో సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను 'బాకీ కార్డుల' రూపంలో ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. గ్రామగ్రామాన పర్యటించి కాంగ్రెస్ ప్రభుత్వ మోసాన్ని ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. సమాజంలోని అన్ని వర్గాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరును ప్రజలకు వివరించేలా కార్యక్రమాలను వినూత్నంగా నిర్వహించాలని సూచించారు. సమీక్ష సమావేశంలో వర్ధన్నపేట మున్సిపాలిటీ, మండల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ పేరుతో మోసం..!

- గర్భవతిని చేసి మొహం చాటేస్తున్నాడు
- సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌పై యువతి సంచలన ఆరోపణలు
- స్వగ్రామానికి వచ్చిన యువకుడిని నిలదీసిన బాధితురాలు

కాకతీయ, కొత్తగూడెం ప్రతినిధి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలో ప్రేమ వ్యవహారం కలకలం రేపింది. బూర్గంపాడు ఎస్సీ కాలనీకి చెందిన శివాని అనే యువతిని ప్రేమ పేరుతో మోసం చేశాడనే ఆరోపణలు వెలువడ్డాయి. ఢిల్లీలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సాయి అనే యువకుడు తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేశాడని బాధితురాలు ఆరోపిస్తోంది.తాజాగా సాయి స్వగ్రామానికి రావడంతో బాధితురాలు శివాని అతడిని నిలదీసినట్లు సమాచారం. దీంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఇప్పుడు తనను మోసం చేస్తున్నాడని శివాని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేసింది. ఈ వ్యవహారంపై బాధితురాలి ఆరోపణలు మాత్రమే ప్రస్తుతం వెలుగులో ఉన్నాయి. సాయి వైపు నుంచి ఎలాంటి వివరణ వెలువడలేదు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, వాస్తవ పరిస్థితులు తెలియాల్సి ఉంది.

## మచిలీ బజార్‌లో ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు

- మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు తెలిపిన విష్ణువర్ధన్‌రెడ్డి



కాకతీయ, హన్మకొండ : వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 10వ డివిజన్ మచిలీ బజార్‌లో మిలాద్–ఉన్–నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అల్లుడు విష్ణువర్ధన్‌రెడ్డి హాజరై ముస్లిం సోదరులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ఆయన మిలాద్–ఉన్–నబీ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, సోదరభావం, మానవత్వం, ఐక్యత వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని విష్ణువర్ధన్‌రెడ్డి ఆకాంక్షించారు. సమాజంలో అన్ని వర్గాల మధ్య సోదరభావం, మత సామరస్యం మరింత బలోపేతం కావాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, డివిజన్ అధ్యక్షుడు ఫిరోజ్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముస్లిం మత పెద్దలు, యువకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు రాలేదు.. పాత ఇల్లు ప్రాణం తీసింది!

- మామిడిపల్లిలో శిథిలాల కింద చిక్కుకుని మహిళ దుర్మరణం
- ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసినా మంజూరు కాలేదని గ్రామస్థుల ఆరోపణ
- అర్హులైన పేదలకు ఇళ్లు అందుతున్నాయా? అంటూ ప్రశ్నలు
- గుమ్మడి లక్ష్మి (బుజ్జక్క) మృతితో గ్రామంలో తీవ్ర విషాదం




కాకతీయ, కోనరావుపేట : రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో బుధవారం ఉదయం విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుమ్మడి లక్ష్మి (బుజ్జక్క) నివాసం ఉంటున్న పాత ఇల్లు ఒక్కసారిగా కూలిపోవడంతో శిథిలాల కింద చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికుల కథనం ప్రకారం.. లక్ష్మి కుటుంబం చాలాకాలంగా శిథిలావస్థకు చేరిన పాత ఇంట్లోనే జీవిస్తోంది. ఇంటి పరిస్థితి ప్రమాదకరంగా మారినప్పటికీ ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో కొత్త ఇల్లు నిర్మించుకోలేక అదే ఇంట్లో ఉంటున్నారని గ్రామస్థులు తెలిపారు. పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద లక్ష్మి కుటుంబం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇల్లు మంజూరు కాలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సకాలంలో ఇల్లు మంజూరై ఉంటే కుటుంబానికి సురక్షితమైన నివాసం లభించి ఉండేదని, ఈ విషాదాన్ని నివారించే అవకాశం ఉండేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. "ఇందిరమ్మ ఇళ్ల పథకం ఉన్నా.. నిరుపేద కుటుంబానికి సురక్షితమైన ఇల్లు ఎందుకు అందలేదు ?" అంటూ గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. అర్హులైన పేదల దరఖాస్తులను అధికారులు ఏ ప్రాతిపదికన పరిశీలిస్తున్నారనే అంశంపైస్పష్టత ఇవ్వాలనికోరుతున్నారు.

### కుటుంబం కన్నీరుమున్నీరు

లక్ష్మి మృతితో ఆమె భర్త కమలాకర్, కుమారుడు పవన్, కుమార్తె రోహిణి తీవ్ర విషాదంలో మునిగిపోయారు. నిరుపేద కుటుంబానికి సురక్షితమైన ఇల్లు అందక, చివరకు అదే శిథిలావస్థలో ఉన్న ఇల్లు ఓ నిండు ప్రాణాన్ని బలిగొనడం బాధాకరమని గ్రామస్థులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు అర్హత ఉంటే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి సురక్షిత నివాసం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు. కోనరావుపేట మండలంలోని శిథిలావస్థలో ఉన్న ఇళ్లను అధికారులు గుర్తించి, ప్రమాదకర పరిస్థితుల్లో నివసిస్తున్న కుటుంబాలను అప్రమత్తం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై సమగ్రంగా విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## రోడ్డుపై భారీ గుంత.. వాహనదారులకు ఇక్కట్లు

**ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు**



కాకతీయ,శంకరపట్నం:కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల కేంద్రంలోని కేశవపట్నం–కరీంపేట మధ్య ప్రధాన రహదారిపై భారీ గుంత ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుకు మధ్యలోనే పెద్ద గుంత ఏర్పడినా ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గం హైదరాబాద్ ప్రాంతానికి వెళ్లే వాహనదారులకు షార్ట్‌కట్‌గా ఉండటంతో నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. రోడ్డుపై ఏర్పడిన గుంత కారణంగా ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంతను వెంటనే పూడ్చి రహదారికి మరమ్మతులు చేపట్టి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు ఆర్అండ్‌బీ అధికారులను కోరుతున్నారు.

## 2.5 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

- పెట్రోలింగ్‌లో పట్టుబడిన అక్రమ నిల్వ
- రూ.30 వేల విలువైన సామగ్రి స్వాధీనం
- ఎస్సై గంగారపు కరుణాకర్ హెచ్చరిక



కాకతీయ, నెల్లికుదురు : బెల్లం గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై గంగారపు కరుణాకర్ హెచ్చరించారు. బుధవారం హనుమాన్‌నగర్ తండా శివారులోని భూక్యా దానియా తండాలో పెట్రోలింగ్ చేస్తుండగా సమా చారం మేరకు భూక్యా రాజేందర్ ఇంటి ముందు ఉన్న కారును తనిఖీ చేశారు. అందులో 2.5 క్వింటాళ్ల నల్లబెల్లం, 20 కేజీల పటిక, 5 లీటర్ల గుడుంబా లభించగా.. మొత్తం రూ.30 వేల విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నల్లబెల్లం, పటికను విక్రయించిన జామతండాకు చెందిన గూగులోత్ నగేష్, భూక్యా రాజేందర్ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## నేడు నాటిన మొక్కే.. రేపటి తరానికి ఊపిరి

**డీఎల్పీఓ రాంబాబు పిలుపు**



కాకతీయ, కారేపల్లి: కారేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది కలిసి ఆలయ పరిసరాల్లో మొక్కలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీఎల్పీఓ రాంబాబు సూచించారు. సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ) మాట్లాడుతూ మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. పచ్చదనంతో భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందుతుందన్నారు. గ్రామపంచాయతీని పచ్చదనం, పరిశుభ్రతలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఎంపీడీవో పద్మ, ఎంపీవో మల్లెల రవీంద్ర ప్రసాద్,కార్యదర్శినెహ్రూ,ఉపసర్పంచ్‌భాగ్యలక్ష్మి ,సిబ్బంది,స్థానికులు పాల్గొన్నారు.

# అడగొద్దు మెనూ.. పెట్టింది తిను..

## ప్రభుత్వం నిర్దేశించిన మెనూకు తూట్లు

- సాంబార్ స్థానంలో చింతపండు చారు.. ఆకుకూర పప్పుకు పంగనామం
- డయాలసిస్ రోగులు, బాలింతలకు భోజనం అందించడంలోనూ నిర్లక్ష్యం
- ప్రశ్నిస్తే దురుసు సమాధానాలు
- నాణ్యత ప్రమాణాలపై కరువైన పట్టింపు
- గుత్తేదారు తీరుపై ఆరోపణలు
- చర్యలు చేపట్టాలంటున్న రోగులు



మెనూ ప్రకారం అందకుండా ఉన్న భోజనం



రోగి కోసం చేతి సంచిలో భోజనం తీసుకెళ్తున్న రోగి బంధువులు



ఏటూరునాగారం సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిలో భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

కాకతీయ, ఏటూరునాగారం : రోగులకు వైద్యం ఎంత ముఖ్యమో.. చికిత్స సమయంలో సమయానికి నాణ్యమైన పౌష్టికాహారం అందించడం కూడా అంతే ముఖ్యం. ముఖ్యంగా డయాలసిస్ రోగులు, బాలింతలకు ఆహారంలో ఏమాత్రం నిర్లక్ష్యానికి తావులేదు. రోగుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందించాల్సిన ఆహారానికి ప్రభుత్వం సమయాలు, పరిమాణాలతో సహా స్పష్టమైన మెనూను నిర్దేశించింది. ఉదయం 7.30 నుంచి 8.30 గంటల మధ్య 150 గ్రాముల ఇడ్లీ–3, సాంబార్/చట్నీ 100 మి.లీ., పొంగల్/కిచిడీ/ఉప్మా 300 గ్రాములు, మినపప్పు–చట్నీ/బ్రెడ్ 100 గ్రాములు, పాలు 150 మి.లీ., గుడ్డు ఒకటి ఇవ్వాలి. మధ్యాహ్నం 12 నుంచి 1 గంటలోపు 450 గ్రాముల అన్నం/6 అంగుళాల పుల్కా, కూరగాయల కూర 50 గ్రాములు, ఆకుకూరల పప్పు 100 గ్రాములు, సాంబార్ 150 మి.లీ., గుడ్డు, పెరుగు/మజ్జిగ 100 మి.లీ., అరటిపండుతో పాటు సాయంత్రం చిక్కీ 50 గ్రాములు/ఉడికించిన పల్లి 20 గ్రాములు అందించాలి. రాత్రి 6 నుంచి 8 గంటల మధ్య 450 గ్రాముల అన్నం/పుల్కా, కూరగాయల కుర్మా 100 గ్రాములు, సాంబార్ 150 మి.లీ., ఆకుకూరల పప్పు 50 గ్రాములు, గుడ్డు, పెరుగు/మజ్జిగ 100 మి.లీ. ఇవ్వాల్సి ఉంది. అయితే ఏటూరునాగారం సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నిబంధనలు అమలు కావడం లేదని పలువురు రోగులు, బంధువుల నుంచి 'కాకతీయ'కు సమాచారం అందింది. ఆ సమాచారాన్ని నిర్ధారించుకునేందుకు ఆసుపత్రిలో పరిశీలించగా.. మెనూ బోర్డుపై ఉన్న నిబంధనలకు, రోగుల ప్లేట్లలో వడ్డిస్తున్న భోజనానికి పొంతనే లేకపోవడం స్పష్టమైంది.

### సాంబార్ స్థానంలో చింతపండు చారు.. పప్పుకు పంగనామం

ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం మధ్యాహ్నం, రాత్రి భోజనంలో సాంబార్, ఆకుకూరల పప్పు, కూరగాయల కూర/కుర్మా, గుడ్డు, పెరుగు లేదా మజ్జిగ ఉండాలి. కానీ ఏటూరునాగారం సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిలో సాంబార్‌కు బదులుగా చింతపండు చారు వడ్డిస్తున్నారు. ఆకుకూరల పప్పు అందించడం లేదు. పెరుగు లేదా మజ్జిగ కూడా క్రమం తప్పకుండా ఇవ్వడం లేదు. మెనూలో పేర్కొన్న పౌష్టిక పదార్థాలను పక్కనపెట్టి అన్నం, చారు, ఒక కూరతోనే భోజనం ముగిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. రోగులు త్వరగా కోలుకునేందుకు అవసరమైన పోషకాలు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం నిర్దేశించిన మెనూకే కోతలు పడుతుండటంపై రోగులు, వారి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాల్సిన చోట నామమాత్రపు భోజనంతో సరిపెట్టడం.. రోగుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన విధానాన్ని నీరుగారుస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### భోజనం పంపిణీలోనూ నిర్లక్ష్యం

ఈ పరిస్థితికి తోడు డయాలసిస్ రోగులు, బాలింతలకు వారి బెడ్ వద్దకే భోజనం అందించాల్సి ఉండగా.. ఈ విధానం సక్రమంగా అమలు కావడం లేదని రోగుల బంధువులు చెబుతున్నారు. రోగి తరపున ఎవరైనా వచ్చి ఆహారం తీసుకెళ్తే అందిస్తున్నారని.. ఎవరూ రాకపోతే వారికి భోజనం అందని పరిస్థితి ఉంటోందని ఆరోపిస్తున్నారు. స్వయంగా లేచి వెళ్లలేని రోగుల వద్దకు సిబ్బందే భోజనం తీసుకెళ్లాల్సి ఉన్నా.. బంధువు వస్తేనే ఆహారం చేరే పరిస్థితి నెలకొనడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోగికి అందాల్సిన భోజనం కోసం కూడా బంధువులే పరుగులు తీయాల్సి వస్తుండటంతో.. ఆసుపత్రి సేవల పర్యవేక్షణ తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### తింటే తినండి.. లేకపోతే మీ ఇష్టం

మెనూ ప్రకారం భోజనం ఎందుకు అందించడం లేదని ప్రశ్నించిన రోగులు, వారి బంధువులకు నిర్వాహకుల నుంచి దురుసు సమాధానాలు ఎదురవుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. "ఇక్కడ ఇలాగే ఉంటుంది.. తినండి.. లేకపోతే మీ ఇష్టం" అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని పలువురు వాపోతున్నారు. భోజన నాణ్యత, నిర్ణీత పరిమాణాలు, సమయపాలనపై ప్రశ్నించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను పక్కనపెట్టి, నాణ్యతలోనూ కోతలు పెడుతూ గుత్తేదారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు.. రోగుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యానికే తూట్లు పొడుస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు తక్షణమే తనిఖీ నిర్వహించి వాస్తవాలను నిగ్గుతేల్చడంతోపాటు, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## వివాహ వేడుకల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి



కాకతీయరాయపర్తి : మండల పరిధిలో బుధవారం నిర్వహించిన పలు వివాహ వేడుకల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎర్రబెల్లి రాకతో కళ్యాణ మండపాల వద్ద ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. రాయపర్తికి చెందిన దొనగోని రవి గౌడ్ కూతురు సహస్ర–సందీప్ గౌడ్ వివాహం వర్ధన్నపేట ఏబీఎస్ వేడుకల మందిరంలో జరిగింది.ఈ సందర్భంగా నూతన వివాహ బంధంలోకి అడుగుపెట్టిన నవదంపతులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.అక్షతలు వేసి వారి దాంపత్య జీవితం సంతోషకరంగా సాగాలని ఆశీర్వదించారు.కోలనుపల్లి గ్రామానికి చెందిన టీఎం రంగమాచార్యులు కూతురు సుష్మా–సాయి శ్రీనివాస్ వివాహానికి హాజరై నవ దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్,చందు రాము,సతీష్,ఎల్ల స్వామి,సాయి గౌడ్,లక్ష్మణ్,సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ శివ కుటుంబాన్ని పరామర్శించిన చల్లా



కాకతీయ, పరకాల: పరకాల పట్టణానికి చెందిన జర్నలిస్ట్ ఓదెల శివ తండ్రి బిక్షపతి మృతి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బిక్షపతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ దుఃఖ సమయంలో కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బిక్షపతి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జీవో నం.97 రద్దు చేయాలని నిరసన

- విద్యార్థుల నిరసనకు బీఆర్ఎస్ నేతల సంఘీభావం
- హాజరు కానున్న ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

కాకతీయ, హన్మకొండ : జీవో నం.97లోని శక్తి స్కీమ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. విద్యార్థుల ఆందోళనకు సంఘీభావం తెలిపేందుకు సిద్దిపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్‌రావు, మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ హాజరుకానున్నారు. గురువారం ఉదయం 11 గంటలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా కార్యాలయం తెలిపింది. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని వారు డిమాండ్ చేయనున్నారు. కార్యక్రమాన్ని మీడియా ప్రతినిధులు కవర్ చేయాలని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం కోరింది.

## ఎస్సీ డిపార్ట్‌మెంట్ సమావేశానికి స్థల పరిశీలన

- ఈ నెల 30న హనుమకొండలో మూడు జిల్లాల సమావేశం
- హయగ్రీవాచారి గ్రౌండ్‌లో ఏర్పాట్ల పరిశీలన
- దళిత సంక్షేమం, అభివృద్ధిపై సమావేశంలో చర్చ
- నాయకులు, కార్యకర్తలు, దళితులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి
- డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ



కాకతీయ, హనుమకొండ : కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 30న నిర్వహించనున్న హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల ఎస్సీ డిపార్ట్‌మెంట్ సమావేశం కోసం హయగ్రీవాచారి గ్రౌండ్‌లో స్థల పరిశీలన చేపట్టారు. హనుమకొండ జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డితో కలిసి ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు ఆరూరి సాంబయ్య, వరంగల్ జిల్లా అధ్యక్షుడు చిలివేరు శ్రీనివాస్‌తో కలిసి డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 30న జరిగే సమావేశానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, దళితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. దళితుల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతో పాటు భవిష్యత్‌లో అమలు చేయనున్న కార్యక్రమాలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. దళితుల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సమగ్రంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. దళితుల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పరశురామ్, చందు, శ్వేత, కర్నేల్, శ్రీనివాస్, చిరంజీవి, గాంధీ తదితరులు పాల్గొన్నారు.0

## కదిలిన జిల్లా యంత్రాంగం






- రాయపర్తి పీహెచ్‌సీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- 'పేరుకే 24 గంటల ఆసుపత్రి' కథనానికి తక్షణ స్పందన
- అపరిశుభ్రతపై ఆగ్రహం.. 24/7 వైద్యం అందాల్సిందే
- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు
- : వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

కాకతీయ, రాయపర్తి: వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై 'కాకతీయ' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జిల్లా యంత్రాంగం స్పందించింది. ఆగస్టు 22న 'పేరుకే 24 గంటల ఆసుపత్రి' శీర్షికన ప్రచురితమైన కథనంపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో మందుల నిల్వలు, సిబ్బంది హాజరు రిజిస్టర్లు, ల్యాబొరేటరీ నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. పీహెచ్‌సీలో రోగులకు 24 గంటలూ వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సాయంత్రం వేళల్లో ఆసుపత్రి మూసివేతపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యులు, సిబ్బంది విధుల్లో అంకితభావంతో పనిచేస్తూ రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ల్యాబొరేటరీని పరిశీలించి అక్కడి వైద్య సామగ్రి, నిర్వహణపై ఇన్‌చార్జిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్ ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### మందుల నిల్వల పరిశీలన

మందుల నిల్వలను పరిశీలించిన కలెక్టర్ గడువు ముగిసిన మందులు ఎట్టి పరిస్థితుల్లోనూ నిల్వ ఉండకూడదని స్పష్టం చేశారు. మందులను నిబంధనల ప్రకారం సురక్షితంగా భద్రపరచాలని ఆదేశించారు. అనంతరం రోగులతో నేరుగా మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం స్థానిక ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను కలెక్టర్ సందర్శించారు. చిన్నారులకు నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ తనిఖీలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాష్, మండల వైద్య అధికారి అరుణ్ చంద్ర, స్థానిక సర్పంచ్ గారె సహేంద్ర బిక్షపతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి భారీ నిధులు

- రూ.4.46 కోట్ల పనులకు శ్రీకారం చుట్టిన మంత్రి సీతక్క
- మార్కెట్ యార్డుల అభివృద్ధికి రూ.3.11 కోట్ల కేటాయింపు
- శివాపూర్, గోగుపల్లిలో సీసీ రోడ్లు, డ్రైన్ల ప్రారంభం
- ప్రజలకు అవసరమైన వసతుల కల్పనే లక్ష్యం : మంత్రి సీతక్క



కాకతీయ, ఏటూరునాగారం రూరల్ : మారుమూల గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ప్రజలకు అవసరమైన వసతులను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం తాడ్వాయి, ఏటూరునాగారం మండలాల్లో పర్యటించిన మంత్రి మొత్తం రూ.4.46 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. తాడ్వాయి వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.83 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. అనంతరం ఏటూరునాగారం వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ కమిటీ నిధులు రూ.2.28 కోట్లతో చేపట్టనున్న వివిధ పనులకు శ్రీకారం చుట్టారు. రైతులకు మెరుగైన వసతులు కల్పించడంతోపాటు మార్కెట్ యార్డుల అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన నిధులు సమకూరుస్తోందన్నారు. సీఆర్ఆర్–ప్లెయిన్ 2025–26 నిధులతో శివాపూర్‌లో రూ.80 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లు, డ్రైన్లను, గోగుపల్లిలో రూ.55 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును ప్రారంభించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత గడువులో పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

### క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం

ఏటూరునాగారం వై జంక్షన్ సమీపంలో మండల కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామసభలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎస్ఐఆర్ ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్, ఎస్ఐఆర్ ములుగు జిల్లా ఇన్‌చార్జి ప్రకాష్, ములుగు డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా ఆత్మ చైర్మన్ చిటమట రఘు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

- 40 మంది కుటుంబాలకు డెత్ గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ ఇవ్వాలి
- 3,000 మంది ఉపాధ్యాయులకు ఐదు డీఏలు పెండింగ్
- ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీస్తాం
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు


కాకతీయ, హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్య వైఖరితో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. మోడల్ స్కూల్ టీచర్ల సంఘం నాయకులు, విధి నిర్వహణలో మృతి చెందిన ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులు తనను కలిసి సమస్యలను వివరించారని తెలిపారు. 2004 తర్వాత సీపీఎస్ విధానంలో నియమితులై మృతి చెందిన సుమారు 40 మంది మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వ జీవోలు 60, 58 ప్రకారం డెత్ గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ పొందేందుకు అర్హత ఉన్నప్పటికీ మోడల్ స్కూళ్లకు వాటిని అమలు చేయకపోవడంతో బాధిత కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి ఆ కుటుంబాలకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

### ఐదు డీఏలు పెండింగ్

రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న సుమారు 3,000 మంది ఉపాధ్యాయులకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని హరీశ్‌రావు తెలిపారు. డీఏ బకాయిల కోసం విద్యాశాఖ కోరిన రూ.93 కోట్ల అదనపు బడ్జెట్ ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలపలేదని ఆరోపించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న జీతాల బడ్జెట్ నుంచైనా బకాయిలు చెల్లించేందుకు అనుమతించాలని కోరినా ఆ ఫైల్ ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. ఐదు డీఏల కారణంగా ఒక్కో ప్రిన్సిపాల్‌కు రూ.3.52 లక్షలు, పీజీటీకి రూ.2.81 లక్షలు, టీజీటీకి రూ.2.36 లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉందని తెలిపారు. ఈ బకాయిలను వెంటనే ఒకేసారి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు కొత్త మార్గదర్శకాల ప్రకారం ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్)ను వెంటనే వర్తింపజేయాలని హరీశ్‌రావు కోరారు. మోడల్ స్కూళ్లను '010' పద్దు కిందకు తీసుకువచ్చి ఆర్థిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు బోధనపై దృష్టి పెట్టాల్సిన సమయంలో తమ హక్కుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి కల్పించడం సిగ్గుచేటని విమర్శించారు. బాధిత కుటుంబాలు, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, డెత్ గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్, పెండింగ్ డీఏల సాధన కోసం ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హరీశ్‌రావు తెలిపారు.

## అత్యాచారం కేసులో తేజ్‌పాల్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

- లొంగిపోవడం నుంచి మినహాయింపు కోరిన పిటిషన్ తిరస్కరణ
- రెండు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశం
- 2013 నాటి అత్యాచారం కేసులో దోషిగా తేలిన మాజీ తెహెల్కా ఎడిటర్



న్యూఢిల్లీ : 2013 నాటి అత్యాచారం కేసులో దోషిగా తేలిన మాజీ తెహెల్కా ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. లొంగిపోవడం నుంచి మినహాయింపు కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం తిరస్కరించింది. రెండు వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశించింది. తేజ్‌పాల్ పిటిషన్‌పై జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలోని సింగిల్ జడ్జి బెంచ్ సోమవారం విచారణ పూర్తి చేసి తీర్పును రిజర్వ్ చేసింది. మంగళవారం పిటిషన్‌ను తిరస్కరిస్తూ లొంగిపోవడానికి రెండు వారాల గడువు ఇచ్చింది. తేజ్‌పాల్ అప్పీల్‌ను విచారణకు స్వీకరించాలంటే ముందుగా ఆయన లొంగిపోయినట్లు ధ్రువీకరించే సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుందని గోవా ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. సుప్రీంకోర్టు రూల్స్, 2013తో పాటు గత తీర్పులను ఆయన ప్రస్తావించారు. అయితే గోవా ప్రభుత్వం పేర్కొన్న సుప్రీంకోర్టు నిబంధనలు ఈ కేసుకు వర్తించవని తేజ్‌పాల్ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు.

## 35 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

- అక్రమంగా తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్
- టాటా ఏసీ పికప్ ట్రాలీ స్వాధీనం
- భూపాలపల్లి కలెక్టరేట్ సమీపంలో సీసీఎస్ పోలీసుల తనిఖీలు



కాకతీయ, భూపాలపల్లి : అక్రమంగా తరలిస్తున్న 35 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని భూపాలపల్లి సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరిని అరెస్టు చేసి, బియ్యాన్ని తరలిస్తున్న టాటా ఏసీ పికప్ ట్రాలీని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. భూపాలపల్లి కలెక్టరేట్ సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం తనిఖీలు నిర్వహిస్తుండగా పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని గుర్తించారు. వాహనంలో సుమారు 35 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అలాగే TS 02 UC 2103 నంబర్ గల టాటా ఏసీ పికప్ ట్రాలీని సీజ్ చేశారు. ఈ కేసులో భూపాలపల్లి సీఆర్ నగర్‌కు చెందిన పావనపు రాజు (26), నీలుగొండ రమేష్ (21)లను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. రాజు వ్యాపారం, రమేష్ డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. అరెస్టు చేసిన నిందితులను తదుపరి చట్టపరమైన చర్యల కోసం భూపాలపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు అప్పగించినట్లు సీసీఎస్ పోలీసులు తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించడం, నిల్వ చేయడం, విక్రయించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## దక్షిణ కొరియా వర్సిటీలో నిషితకు సీటు

- ప్రతిష్ఠాత్మక 'కొయికా' ఫుల్ స్కాలర్‌షిప్‌తో ఎంఎస్సీ అగ్రికల్చర్‌లో అడ్మిషన్
- ఆరు భాషల్లో ప్రావీణ్యం.. రెండుసార్లు పోస్కో స్కాలర్‌షిప్ విజేత
- పేదరికాన్ని అధిగమించి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ
- నిషిత ప్రయాణం నేటి యువతకు స్ఫూర్తిదాయకం
- : ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్



కాకతీయ, హైదరాబాద్ : పట్టుదల, ప్రతిభ ఉంటే ఎలాంటి పరిస్థితులనైనా అధిగమించి అంతర్జాతీయ స్థాయిలో రాణించవచ్చని పెద్దపల్లి జిల్లాకు చెందిన వెనగంటి నిషిత నిరూపించారు. దక్షిణ కొరియాలోని ప్రతిష్ఠాత్మక క్యుంగ్‌బుక్ నేషనల్ యూనివర్సిటీ (కేఎన్‌యూ)లో 'కొయికా' (KOICA) పూర్తి స్కాలర్‌షిప్‌తో ఎంఎస్సీ అగ్రికల్చర్ కోర్సులో ఆమె ప్రవేశం పొందారు. ఈ ఘనత సాధించిన నిషితను మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ అభినందించారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం రూప్ నారాయణపేటకు చెందిన నిషిత ఒంటరి తల్లి పెంపకంలో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూనే ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకున్నారు. 15 ఏళ్లకే ఇంటర్మీడియట్ పూర్తి చేసి బీసీ గురుకులాల్లో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. అనంతరం 19 ఏళ్ల వయసులో ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో కొరియన్ లాంగ్వేజ్ విభాగంలో డిగ్రీ పూర్తి చేశారు. చదువులో ప్రతిభ కనబరుస్తూ రెండుసార్లు ప్రతిష్ఠాత్మక పోస్కో (POSCO) స్కాలర్‌షిప్‌ను సైతం నిషిత అందుకున్నారు. ఆమెకు ఆరు భాషల్లో ప్రావీణ్యం ఉండటం విశేషం.

### రైతులకు అండగా నిలవడమే లక్ష్యం

దక్షిణ కొరియాలో ఎంఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసి ఆధునిక స్మార్ట్ వ్యవసాయ పద్ధతులను దేశంలో ప్రవేశపెట్టి రైతులకు అండగా నిలవడమే తన లక్ష్యమని నిషిత తెలిపారు. పలు సవాళ్లను అధిగమించి గ్లోబల్ స్థాయిలో రాణిస్తున్న నిషిత పట్టుదల, అంకితభావం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కొనియాడారు. నిషితతో పాటు ఆమె తల్లి వేముల ప్రవళికను కూడా ఆయన అభినందించారు. నిషితను శాలువాతో సత్కరించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

## షీర్ జోన్లను దాటుతున్న ఎస్ఎల్‌బీసీ

- ప్రమాదకర ప్రాంతంలోనూ కొనసాగుతున్న టన్నెల్ తవ్వకాలు
- ఇప్పటివరకు 515 మీటర్ల మేర పనులు పూర్తి
- జపాన్ నుంచి తెప్పించిన త్రీఆర్ బూమర్ మిషన్‌తో వేగం
- 2028 మే నాటికి టన్నెల్ పూర్తి చేసే లక్ష్యం



కాకతీయ, నల్గొండ : ఫ్లోరైడ్ సమస్యతో బాధపడుతున్న నల్లగొండ జిల్లాకు సాగునీరు, తాగునీరు అందించాలన్న లక్ష్యంతో చేపట్టిన శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ టన్నెల్ పనులు మళ్లీ వేగం పుంజుకున్నాయి. గతేడాది బ్రహ్మగిరి (దోమలపెంట) ఇన్‌లెట్ వైపు 13.5 కిలోమీటర్ వద్ద టన్నెల్ పైకప్పు కూలిన ఘటనలో ఎనిమిది మంది మృతి చెందడంతో పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ప్రమాదం తర్వాత సాంకేతిక సవాళ్లను అధ్యయనం చేసిన ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ఈ ఏడాది ఫిబ్రవరి 16న పనులను పునఃప్రారంభించింది. టన్నెల్ మొత్తం పొడవు 43.9 కిలోమీటర్లు. దోమలపెంట సమీపంలోని బ్రహ్మగిరి ఇన్‌లెట్ నుంచి మన్నెవారిపల్లి ఔట్‌లెట్ వరకు సొరంగం నిర్మించాల్సి ఉంది. ప్రమాదానికి ముందు బ్రహ్మగిరి వైపు 13.936 కిలోమీటర్లు, మన్నెవారిపల్లి వైపు 20.435 కిలోమీటర్ల మేర తవ్వకాలు పూర్తయ్యాయి. ఇంకా 9.533 కిలోమీటర్ల తవ్వకం మిగిలి ఉంది. ప్రమాదం జరిగిన ప్రాంతంలో భూగర్భ రాళ్ల పొరలు బలహీనంగా ఉండే షీర్ జోన్ ప్రధాన సవాల్‌గా మారింది. దీంతో నేరుగా తవ్వకాలు చేపట్టకుండా 100 మీటర్లు వెనక్కి వచ్చి సమాంతరంగా బైపాస్ టన్నెల్ తవ్వారు. 136 మీటర్ల మేర ముందుకు వెళ్లి ప్రమాదకర షీర్ జోన్‌ను దాటారు. ప్రస్తుతం ప్రధాన టన్నెల్ పనులు కొనసాగుతున్నాయి. మరో 8–12 మీటర్ల షీర్ జోన్‌ను కూడా ఇంజినీర్లు గుర్తించారు. పైకప్పు, గోడల నుంచి రాళ్లు ఊడిపడకుండా ISHP రిబ్స్, స్టీల్ రిబ్స్, రాక్ బోల్ట్స్ ఏర్పాటు చేస్తున్నారు.

### జపాన్ నుంచి త్రీఆర్ బూమర్ మిషన్

పనుల వేగాన్ని పెంచేందుకు జపాన్ నుంచి త్రీఆర్ బూమర్ మిషన్‌ను ప్రత్యేకంగా తెప్పించారు. ఇప్పటికే మన్నెవారిపల్లి ఔట్‌లెట్ వైపు ఈ యంత్రంతో తవ్వకాలు ప్రారంభించారు. మరో నెల రోజుల్లో ఇన్‌లెట్ వైపు కూడా ఈ మిషన్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇన్‌లెట్, ఔట్‌లెట్ రెండు వైపులా కలిపి రోజుకు 17 మీటర్ల వరకు టన్నెల్ తవ్వే సామర్థ్యం ఈ మిషన్‌కు ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మన్నెవారిపల్లి వైపు 379 మీటర్లు, బ్రహ్మగిరి వైపు 136 మీటర్ల మేర కొత్తగా తవ్వకాలు జరిగాయి. మొత్తంగా ఇన్‌లెట్, ఔట్‌లెట్ ప్రాంతాల్లో 515 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. భూగర్భ పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తూ పనులు కొనసాగిస్తున్నారు. జియాలజిస్టులు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం భూ పొరలను పరిశీలించిన తర్వాతే తదుపరి పనులను చేపడుతున్నారు. టన్నెల్ మార్గంలో మరో నాలుగు ప్రాంతాల్లో షీర్ జోన్లు ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఇప్పటికే ఒక ప్రమాదకర షీర్ జోన్‌ను అధిగమించి పనులు ముందుకు సాగుతున్న నేపథ్యంలో, మిగిలిన ప్రాంతాల్లో నూ భద్రతకు ప్రాధాన్యమిస్తూ తవ్వకాలు చేపట్టనున్నారు. టన్నెల్ నిర్మాణం పూర్తయితే శ్రీశైలం జలాశయం బ్యాక్‌వాటర్ నుంచి గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశం ఏర్పడుతుంది. ఫ్లోరైడ్ ప్రభావిత నల్లగొండ ప్రాంతాలకు నీటిని అందించడంలో ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది. అత్యాధునిక యంత్రాలను వినియోగిస్తూ పనుల వేగాన్ని పెంచుతున్న అధికారులు.. ఎలాంటి భౌగోళిక, సాంకేతిక సవాళ్లు ఎదురైనా అధిగమించి టన్నెల్‌ను పూర్తి చేస్తామని చెబుతున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే 2028 మే నాటికి టన్నెల్ మార్గాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## బీసీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు

- రూ.12 వేల విలువైన ఆటోమేటిక్ మిషన్ల పంపిణీ
- 100 శాతం సబ్సిడీతో అందించనున్న ప్రభుత్వం
- 18 నుంచి 55 ఏళ్ల బీసీ మహిళలకు అవకాశం
- సెప్టెంబర్ 15లోగా TGOBMMSలో దరఖాస్తు

హైదరాబాద్: మహిళలను ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం 'ఇందిరమ్మ కుట్టు మిషన్' పథకాన్ని అమలు చేయనున్నట్లు పేర్కొంది. బీసీ సామాజికవర్గానికి చెందిన అర్హులైన నిరుద్యోగ మహిళలకు రూ.12 వేల విలువైన ఆటోమేటిక్ కుట్టు మిషన్లను 100 శాతం సబ్సిడీతో అందించనున్నట్లు సమాచారం. ఈ పథకాన్ని బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని తెలంగాణ బీసీ కార్పొరేషన్ ద్వారా అమలు చేయనున్నారు. 18 నుంచి 55 ఏళ్ల మధ్య వయసున్న మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించకూడదని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఆధార్, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం తదితర పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలి. ప్రభుత్వం సూచించిన TGOBMMS పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. సెప్టెంబర్ 15లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సంబంధిత జిల్లా బీసీ అభివృద్ధి అధికారి లేదా ఈడీ బీసీ కార్పొరేషన్ ద్వారా కూడా వివరాలు తెలుసుకోవచ్చు. మహిళలు స్వయం ఉపాధి పొందేలా కుట్టు మిషన్లను వినియోగించుకుని ఆదాయం పెంచుకోవడానికి ఈ పథకం దోహదపడుతుందని ప్రభుత్వం పేర్కొంది. తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ అధికారిక వివరాల ప్రకారం బీసీ సంక్షేమ కార్యక్రమాల అమలులో బీసీ కార్పొరేషన్ కీలకంగా వ్యవహరిస్తోంది.

## గంజాయి నిందితుడు కస్టడీ నుంచి పరార్..
## ఇద్దరు సస్పెన్షన్

### భద్రాచలం ఎక్సైజ్ స్టేషన్‌లో కలకలం

కాకతీయ, కొత్తగూడెం ప్రతినిధి: భద్రాచలం నిషేధ, ఎక్సైజ్ స్టేషన్‌లో గంజాయి నిందితుడు కస్టడీ నుంచి తప్పించుకోవడం కలకలం రేపింది. ఆగస్టు 4న ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం పట్టుకున్న ఎండు గంజాయి కేసులో 5న కేసు నమోదు చేయగా, అదే రోజు ఏ1 నిందితుడు మాధబ హంతల్ ఎస్‌హెచ్‌వో అదుపు నుంచి పరారయ్యాడు. దీనిపై ఖమ్మం డిప్యూటీ కమిషనర్ (ఎక్సైజ్) ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. ఎస్‌హెచ్‌వో ఎస్.కె. రహీమున్నీసా బేగం, కానిస్టేబుల్ సీహెచ్. రవి కుమార్ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు నివేదికలో పేర్కొన్నారు. పంచనామా, కేసు రికార్డులను తారుమారు చేసి కోర్టును తప్పుదోవ పట్టించేలా ప్రయత్నించినట్లు ఎస్‌హెచ్‌వోపై ఆరోపణలు వచ్చాయి. దీంతో ఇద్దరినీ సస్పెండ్ చేసి శాఖాపరమైన విచారణకు ఆదేశించారు.

## గాంధీ భవన్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- గాంధీ భవన్‌లో ముఖాముఖి కార్యక్రమం
- భూ సమస్యలపై అధికంగా ఫిర్యాదులు
- ధరణితో అనేక సమస్యలు వచ్చాయి
- రెవెన్యూ మంత్రి పటిష్ట చర్యలు తీసుకోవాలి: వి. హనుమంతరావు

కాకతీయ, హైదరాబాద్ : గాంధీ భవన్ కూడా ప్రజల సమస్యల పరిష్కార వేదికగా మారేలా ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు తెలిపారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ప్రజల నుంచి సమస్యలను స్వీకరించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రగతి భవన్ నిర్మించి ప్రజలకు తమ సమస్యలను చెప్పుకునే అవకాశం లేకుండా చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రగతి భవన్‌ను ప్రజా భవన్‌గా మార్చి ప్రజా సమస్యల పరిష్కార కేంద్రంగా తీర్చిదిద్దిందన్నారు. అదే తరహాలో గాంధీ భవన్‌ను కూడా ప్రజలు తమ సమస్యలను నేరుగా చెప్పుకునే వేదికగా మారుస్తున్నట్లు తెలిపారు. ముఖాముఖి కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిన సమస్యల్లో ఎక్కువగా భూ వివాదాలు, భూములకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయని హనుమంతరావు తెలిపారు. గతంలో పటేల్–పట్వారి విధానం ఉన్న సమయంలో భూ సమస్యలు తక్కువగా ఉండేవని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ధరణి వ్యవస్థతో పాటు అనేక భూ సమస్యలు తలెత్తాయని ఆరోపించారు. నాడు ఇందిరాగాంధీ పేదలకు పంపిణీ చేసిన భూములను కొందరు భూస్వాములు తిరిగి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని హనుమంతరావు ఆరోపించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లోనూ తప్పిదాలు జరుగుతున్నాయని పేర్కొంటూ, వాటిపై రెవెన్యూ శాఖ మంత్రి పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఘనంగా మిలాద్-ఉన్-నబి వేడుకలు

- శాంతి, సోదరభావం, మానవతా విలువలు సమాజానికి ఆదర్శం
- మత సామరస్యం, పరస్పర గౌరవంతోనే సమాజ అభివృద్ధి
- అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో జీవించాలి
- టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్



కాకతీయ, నిజామాబాద్ : నిజామాబాద్ నగరంలోని ఖిల్లా రోడ్‌లో జూబ్లీ హోటల్ వద్ద నిర్వహించిన మిలాద్–ఉన్–నబి కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువకులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రవక్త మహమ్మద్ చూపిన శాంతి, సోదరభావం, మానవతా విలువలు సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన బోధనలు ప్రజల మధ్య ఐక్యత, పరస్పర గౌరవం పెంపొందించేందుకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో, సోదరభావంతో జీవించాలని ఆకాంక్షించారు. మత సామరస్యం, పరస్పర గౌరవం, ఐక్యతను మరింత బలోపేతం చేయడం ద్వారా సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొంటుందని, ఇది రాష్ట్ర అభివృద్ధికి దోహదపడుతుందని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, పార్టీ కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## కాసు శేషమ్మ దశదిన కర్మకు సీఎం రేవంత్‌రెడ్డి



కాకతీయ, హైదరాబాద్ : మాజీ మంత్రి కాసు కృష్ణారెడ్డి మాతృమూర్తి కాసు శేషమ్మ దశదిన కర్మ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. జూబ్లీహిల్స్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శేషమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జైవీర్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, నాగరాజు, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు కోటింరెడ్డి వినయ్‌రెడ్డి తదితరులు శేషమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

## ఉద్యోగ సంఘాల పోరుబాట..!

- 27న 33 జిల్లా కేంద్రాల్లో ధర్నాలు
- సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం
- సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో మహాధర్నా
- పీఆర్సీ, డీఏలు, ఓపీఎస్ సహా ఆరు డిమాండ్లపై ఉద్యమం: టీజీఈజేఏసీ

కాకతీయ, హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఉద్యోగ సంఘాలు ప్రత్యక్ష ఆందోళనలకు సిద్ధమయ్యాయి. పీఆర్సీ అమలు, పెండింగ్ డీఏల విడుదల, సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణ, బకాయి బిల్లుల చెల్లింపు, హెల్త్ కార్డుల అమలు ప్రధాన డిమాండ్లుగా తెలంగాణ గెజిటెడ్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ దశలవారీ ఉద్యమానికి పిలుపునిచ్చింది. సుమారు 15 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ఈ కార్యాచరణలో భాగస్వాములు కానున్నట్లు టీజీఈజేఏసీ రాష్ట్ర కమిటీ ఆర్థిక కార్యదర్శి కస్తూరి వెంకట్ తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో పలుమార్లు చర్చలు జరిపినా ఫలితం కనిపించలేదని ఆయన అన్నారు. ఈ నెల 27న రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో ధర్నాలతో ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 1న జిల్లా కేంద్రాల్లో పెన్షన్ విద్రోహ దినం నిరసనలు, సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో చలో హైదరాబాద్ మహాధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లలో రెండో పీఆర్సీ అమలు, ఆరు పెండింగ్ డీఏల విడుదల కీలకంగా ఉన్నాయి. వేతన సవరణలో జాప్యం, పెండింగ్ డీఏల కారణంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంఘాలు పేర్కొంటున్నాయి. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నాయి. అదేవిధంగా పెండింగ్ బిల్లులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని, ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్యం అందించే హెల్త్ కార్డుల పథకాన్ని సమర్థంగా అమలు చేయాలని కోరుతున్నాయి. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరిస్తే చర్చలకు సిద్ధంగా ఉన్నామని కస్తూరి వెంకట్ తెలిపారు. జిల్లాల వారీగా ఉద్యోగులతో సమన్వయం చేసుకుని ఆందోళనలను విజయవంతం చేయనున్నట్లు జేఏసీ నాయకులు పేర్కొన్నారు.

# ఆ అవమానం నా జీవితాన్నే మార్చేసింది





## మాది వ్యవసాయ కుటుంబం.. వ్యాపారంపై ఆసక్తి

"మాది శాయంపేట మండలం ప్రగతిసింగారం. తల్లిదండ్రులు సమ్మక్క, మల్లారెడ్డి. మేము ముగ్గురు అన్నదమ్ములం. నేనే పెద్దవాడిని. మా నాన్నకు నేను వ్యవసాయంలోనే కొనసాగాలన్న కోరిక ఉండేది. 1986లో మేనమామ కూతురు జ్యోతిని వివాహం చేసుకున్నా. పెళ్లయ్యే నాటికి నాకు 19ఏళ్లు కూడా ఉండవనుకుంటా. ఆమె మరీ చిన్నది. నాకు వ్యవసాయంలో కన్నా వ్యాపారం చేయాలనే ఆలోచన ఎక్కువగా ఉండేది. నాకు మొదటి నుంచీ కొత్తగా ఏదైనా చేయాలనే ఆసక్తి ఉండేది. డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న సమయంలో ఫినలెక్స్ కంపెనీలో మార్కెటింగ్‌లో పనిచేసే అవకాశం వచ్చింది. పనితీరు..పర్ఫామెన్స్ చూసి మేనేజర్ పోస్టు ఇచ్చారు. కొద్దిగా ఆధునిక వ్యవసాయం వైపు రైతులు మళ్లుతున్న దశ అది. వ్యవసాయ బావులు, పైపులైన్ల పనులు ఆసమయంలో ఊపందుకున్నాయి. 1993లో నంది పైప్స్, లూబీ ఎలక్ట్రికల్స్ డిస్ట్రిబ్యూటర్‌షిప్ తీసుకున్నా. అప్పటి టీడీపీ ప్రభుత్వం చంద్రబాబు సీఎం అయ్యాక 1994లో స్వజలధార వంటి పథకాలను అమలు చేశారు. దీంతో పైపులు, మోటార్లకు డిమాండ్ పెరిగింది. ఈ ప్రోగ్రాం కింద నాకు తెలిసి ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు 80 శాతం ఆర్డర్లు నేనే తీసుకునేవాడిని. అలా గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులతో పరిచయాలు ఏర్పడ్డాయి. 1997లో నా అమ్మకాల సామర్థ్యాన్ని గుర్తించి నంది పైప్స్ సంస్థ మారుతి కారును బహుమతిగా కూడా ఇచ్చింది" అని తెలిపారు.

### వ్యాపారం నుంచి కాంట్రాక్టు రంగంలోకి

"1999లో ప్రభుత్వ పనుల్లో కాంట్రాక్టర్లే మెటీరియల్ కొనుగోలు చేయాలనే విధానం వచ్చింది. నేను సరఫరా చేసిన మెటీరియల్‌కు బిల్లులు ఆలస్యమయ్యేవి. కొందరు డబ్బులు కూడా ఎగ్గొట్టారు. ఇతరులకు సరఫరా చేస్తే బిల్లుల కోసం ఎదురుచూడాల్సి వచ్చేది. అందుకే నేనే కాంట్రాక్టర్‌గా మారాలని నిర్ణయించుకున్నా. 1999లో కాంట్రాక్టర్‌గా మొదలుపెట్టి 2002 నాటికి స్పెషల్ గ్రేడ్ కాంట్రాక్టర్‌గా ఎదిగా. 2003 నుంచి చల్లా ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ద్వారా పెద్ద పనులు చేపట్టా. అదే సమయంలో నా కుమార్తెను స్కూల్లో చేర్పించేందుకు వెళ్లినప్పుడు అక్కడ సౌకర్యాలు సరిగా లేకపోవడం చూసి విద్యారంగంలోకి వచ్చా. 2003లో గ్రీన్‌వుడ్ స్కూల్ ప్రారంభించాం. ఇప్పటివరకు 23 బ్యాచ్‌లు ఆ స్కూల్ నుంచి పదో తరగతి పూర్తి చేశాయి."

"ఒక అవమానం నా జీవితాన్నే మార్చేసింది. అప్పటివరకు నాకు రాజకీయాల్లోకి రావాలన్న ఆలోచనే లేదు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి వ్యాపారం, కాంట్రాక్టు రంగాల్లో స్థిరపడుతున్నా. కానీ ఒక ప్రజాప్రతినిధి ఇంటికి వెళ్లినప్పుడు ఎదురైన అవమానం నన్ను లోలోపల కుదిపేసింది. అదే రోజు నన్ను అవమానించిన కుటుంబంపైనే ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నా. ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం వచ్చినా వద్దన్నా. నాకు కావాల్సింది ప్రత్యక్ష రాజకీయాలు.. ఎమ్మెల్యేగా ప్రజల తీర్పు పొందడమే. 2009లో చివరి నిమిషంలో బీఫాం చేజారింది. 2012లో ఓడిపోయినా పట్టు వదల్లేదు. చివరకు 2014లో టీడీపీ నుంచి గెలిచా. ఆ తర్వాత కార్యకర్తల కోరిక మేరకు టీఆర్ఎస్‌లో చేరా. కేసీఆర్ సహకారంతో పదేళ్లలో పరకాల నియోజకవర్గానికి సుమారు రూ.2,500 కోట్ల అభివృద్ధి పనులు తీసుకొచ్చా. ఈసారి నా కోసం కాదు.. నన్ను నమ్ముకున్న కార్యకర్తల కోసం గెలవాలి" అని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో తన కుటుంబం, వ్యక్తిగత జీవితం, వ్యాపార ప్రస్థానం, రాజకీయాల్లోకి వచ్చిన మలుపు, ఎన్నికల్లో ఎదురైన ఎత్తుపల్లాలు, చంద్రబాబు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులతో తన అనుబంధాన్ని చల్లా ధర్మారెడ్డి వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..!!

- ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం ఇచ్చిన వద్దన్నా
- ఎమ్మెల్యేగానే గెలవాలన్న పంతంతో ముందుకెళ్లా
- 2009లో చివరి నిమిషంలో బీఫాం చేజారింది.. 2012లో ఓడిపోయా!
- 2014లో టీడీపీ నుంచి గెలిచా.. కార్యకర్తల కోరికతో టీఆర్ఎస్‌లోకి
- కేసీఆర్ భోళాశంకరుడు.. కేటీఆర్, హరీశ్‌రావులతోనూ మంచి అనుబంధం
- పదేళ్లలో పరకాల నియోజకవర్గంలో రూ.2,500 కోట్లతో అభివృద్ధి
- "ఈసారి నా కోసం కాదు.. నన్ను నమ్ముకున్న కార్యకర్తల కోసం గెలవాలి"
- డిజిటల్ మీడియా ప్రతినిధులతో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చిట్‌చాట్

### ఆ అవమానమే రాజకీయాలకు మలుపు

"2008లో శాయంపేట–ప్రగతిసింగారం మధ్య చలివాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టా. ఆ పనుల బిల్లుల విషయంలో అప్పట్లో ఓ పొలిటికల్ ఫ్యామిలీ నన్ను ఇబ్బంది పెట్టింది. ఒకసారి వారి ఇంటికి వెళ్లినప్పుడు ఎదురైన అవమానం నాకు చాలా బాధ కలిగించింది. అప్పటివరకు రాజకీయాల్లోకి రావాలన్న ఆలోచన లేని నేను.. నన్ను అవమానించిన కుటుంబంపైనే ఎన్నికల్లో పోటీ చేయాలని అప్పుడే నిర్ణయించుకున్నా. అదే నా రాజకీయ జీవితానికి ఆరంభం. ఆ అవమానం నాలో కసిని పెంచింది. ఎమ్మెల్యేగా గెలవాలన్న లక్ష్యాన్ని పెట్టుకున్నా. అప్పటి నుంచి నా దృష్టి అంతా ప్రత్యక్ష రాజకీయాలపైనే పెట్టా."

### దయాకర్‌రావు ప్రోత్సాహం.. చంద్రబాబుతో పరిచయం

"ఎర్రబెల్లి దయాకర్‌రావుతో అప్పటికే నాకు పరిచయం ఉంది. రాజకీయాల్లోకి రావాలన్న నా నిర్ణయానికి ఆయన ప్రోత్సాహం ఇచ్చారు. వేం నరేందర్‌రెడ్డితో కలిసి నా ఆలోచనను చంద్రబాబునాయుడికి వివరించా. వరంగల్‌లో ఆయన పాదయాత్ర సమయంలో నాకు మరింత దగ్గరి పరిచయం ఏర్పడింది. 2009లో పరకాల నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకున్నప్పుడు నా ఆలోచనను చంద్రబాబుకు చెప్పా. కొందరు నన్ను చులకనగా మాట్లాడినా నా నిర్ణయం మార్చుకోలేదు. ఆ సమయంలో దయాకర్‌రావు నాకు ఇచ్చిన సహకారాన్ని మర్చిపోలేను."

"2009లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం వచ్చింది. చంద్రబాబునాయుడు కూడా ఎమ్మెల్సీగా పోటీ చేయమని చెప్పారు. కానీ నేను అంగీకరించలేదు. నాకు ఎమ్మెల్సీ పదవి కంటే ఎమ్మెల్యేగా ప్రజల్లోకి వెళ్లి గెలవాలన్నదే లక్ష్యమని స్పష్టం చేశాను. అదే సమయంలో టీడీపీ-టీఆర్ఎస్ పొత్తులో పరకాల సీటు టీఆర్ఎస్‌కు వెళ్లింది. టీఆర్ఎస్ తరఫున పోటీ చేయమని కూడా కోరారు.

### ఆరోపణలను రాజకీయంగానే చూస్తా

నాపై భూకబ్జా ఆరోపణలు రాజకీయ లబ్ధి కోసమే చేస్తున్నారు. ఏ రైతు భూమినీ అక్రమంగా తీసుకోలేదు. ప్రభుత్వ, అసైన్డ్ భూముల జోలికి వెళ్లలేదు. కౌకొండ గుట్టల్లో భూములు ఆక్రమించుకున్నట్లు అసత్య ఆరోపణలు చేస్తున్నారు కొంతమంది. నేను అప్పుడు కొనుగోలు చేసిన భూములన్నీ కూడా పట్టా భూములే. అమ్మిన రైతులకు సంబంధించిన పట్టా దారు పాస్‌పుస్తకాలున్న రైతుల నుంచే కొనుగోలు చేయడం జరిగింది. ఇప్పుడు ఆ భూములను కూడా నేను విక్రయించడం జరిగింది. నాపై ఎలాంటి ఆరోపణలు చేసినా వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నా. వ్యక్తిగత కక్షలకు వెళ్లకుండా రాజకీయంగా వచ్చిన విమర్శలకు రాజకీయంగానే సమాధానం చెబుతా.

### గుంటూరు యువగర్జనకు ప్రత్యేక రైలు

"బాలకృష్ణ యువగర్జన సభ గుంటూరులో జరిగినప్పుడు పరకాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలను తీసుకెళ్లాలని అనుకున్నా. వరంగల్ నుంచి ప్రత్యేక రైలు ఏర్పాటు చేయాలని ప్రయత్నించా. పరకాల నియోజకవర్గానికి సంబంధించి బాధ్యతలపై స్పష్టత లేదని అప్పటి జిల్లా అధ్యక్షుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి బోగీ కేటాయింపు చేసేందుకు నిరాకరించారు. నేను వెనక్కి తగ్గలేదు. యువగర్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎర్రం నాయుడి వద్దకు నేరుగా వెళ్లి నాకు ఒక బోగి కేటాయించేలా చూడాలని రెక్వెస్ట్ చేశాను. ఆయన కూడా ప్రకాశ్ రెడ్డికి చెప్పి చూసినా వినలేదు. ఆయన కూడా నేనేం చేయలేనన్న హావాభావాలతో విషయం చెప్పే ప్రయత్నం చేస్తుండగా.. అసలు ఒక రైలు బుక్ చేసుకుంటే ఎంత ఖర్చవుతుందన్న అని అడగడంతో ఒక్కసారిగా నా వైపు చూశారు. ఏడున్నర లక్షలు అన్నారు.. ఏం ఇస్తావా అంటూ నవ్వుతూ అన్నారు. ఆయన ఇస్తాను అన్నా రైలు బుక్ చేయండి అని చెప్పడంతో షాకయ్యారు. ఆయనతో మాట్లాడుతుండగానే నిముషాల వ్యవధిలోనే ఆయన టేబుల్‌పై క్యాష్ పెట్టడంతో నేరుగా చంద్రబాబును ఫోన్‌లో కాన్ఫరెన్స్‌కు తీసుకుని విషయం చెప్పడంతో రైలు బుక్ చేయాలని ఆదేశించారు. నాకు బాగా గుర్తు.. నా రైలు వరంగల్‌లో మొదలైతే.. రేవూరి ప్రకాశ్ రెడ్డి పార్టీ తరుపున బయల్దేరిన రైలు కాజీపేటలో బయల్దేరింది. తీసుకెళ్లిన కార్యకర్తలను అన్ని సౌకర్యాలతో, భోజనం ఇతర వసతులతో జాగ్రత్తగా ఇంటికి చేర్చా. అప్పుడు కార్యకర్తలు ఇది ధర్మన్న అంటే గర్వంగా పార్టీ మీటింగ్‌ల్లోనూ చెప్పారు. ఆ ఘటన తర్వాత చంద్రబాబుకు నాపై చాలా నమ్మకం పెరిగింది. కార్యకర్తల కోసం ఏదైనా చేయాలనుకుంటే పదవి ఉండాల్సిన అవసరం లేదని ఆ సంఘటన నాకు నేర్పింది."

### పదేళ్లలో రూ.2,500 కోట్ల అభివృద్ధి

పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న నేను కేసీఆర్ సహకారంతో పరకాల నియోజకవర్గానికి సుమారు రూ.2,500 కోట్ల అభివృద్ధి పనులు తీసుకొచ్చా. 'ఇంటింటికీ మీ చల్లా'లో గుర్తించిన సమస్యల్లో దాదాపు 90 శాతం పరిష్కరించా. పరకాల రెవెన్యూ డివిజన్ పునరుద్ధరణ, కొనాయిమాకుల ప్రాజెక్టు, 100 పడకల ఆస్పత్రి, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు, ఆరు రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, 46 గ్రామాల్లో మహిళా భవనాలు, 57 గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు, పరకాల పట్టణంలో సెంట్రల్ లైటింగ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, పల్లె దవాఖానలు, విద్యుత్తు సబ్‌స్టేషన్లు వంటి పనులు చేశా. పరకాలకు టెక్స్‌టైల్ పార్క్ తీసుకురావడం నాకు ప్రత్యేకమైన సంతృప్తినిచ్చింది. ఉపాధి అవకాశాలు పెంచే ప్రాజెక్టుగా దాన్ని భావించా. నేను పుట్టిన ప్రగతిసింగారాన్ని కూడా మోడల్ గ్రామంగా తీర్చిదిద్దాలని అనుకున్నా. గ్రామ పంచాయతీ భవనం, రామాలయం, కమ్యూనిటీ హాల్, ఫంక్షన్ హాల్, స్కూల్, లైబ్రరీ, ఆస్పత్రి వంటి సదుపాయాలు ఏర్పాటు చేశా. నా ఊరికి నేను ఏదైనా చేయగలిగానన్న సంతృప్తి ఉంది. ప్రజలు నాకు ఇచ్చిన ప్రేమను నా ఊరికి, నా నియోజకవర్గానికి తిరిగి ఇవ్వాలన్నదే నా ఆలోచన. సాధ్యమైనంత వరకు గ్రామాల్లో రోడ్లను వెడల్పుగా నిర్మాణం చేయడం జరిగింది. 30, 40 ఫీట్ల నిర్మాణం కూడా చేపట్టడం జరిగింది. పరకాలలో ఇలాంటి రోడ్ల నిర్మాణం చేపట్టాకే మిగతా నియోజకవర్గాల్లో చేపట్టారు.



### బీఫాం చివరి నిముషంలో చేజారింది..!

"2009 ఎన్నికల్లో నామినేషన్ సందర్భంగా జరిగిన పరిణామాలు ఇప్పటికీ గుర్తున్నాయి. నామినేషన్ చివరి రోజున కొద్ది గంటల్లో గడువు ముగుస్తుందని సమయంలో నాకు బీఫాం ఇస్తున్నట్లుగా టీడీపీ ఆఫీసు నుంచి కాల్ చేశారు. నా డ్రైవర్‌ను హైదరాబాద్‌కు పంపా. అప్పుడు టీడీపీలోనే ఉన్న కొంతమంది కుట్రలు, రాజకీయ గందరగోళం మధ్య ఫాతిమా బ్రిడ్జి వద్దనే బీఫాంలతో వెళ్తున్న కారును అడ్డుకున్నారు. బీఫాంలు తీసుకున్నారు. బీఫాం అందుతుందనే నమ్మకంతో నేను కేంద్రంలోపలికి వెళ్లా. నా డ్రైవర్ ఇతర నాయకులు కలిసి బీఫాం ఇతర పత్రాలతో నామినేషన్ కేంద్రం వద్దకు వచ్చేసరికే కొద్ది నిముషాల తేడాలోనే గేట్లు మూసేశారు. డ్రైవర్ గోడ దూకి లోపలికి వచ్చినా ప్రయోజనం లేకపోయింది. చివరి నిమిషంలో బీఫాం నా చేతికి రాకుండానే చేజారిపోయింది. అంతా సినిమా క్లైమాక్స్‌లా జరిగింది. ఆ రోజు బాధపడ్డా.. కానీ నా రాజకీయ ప్రయాణాన్ని మాత్రం ఆపలేదు. 2012 ఉప ఎన్నికల్లో పరకాల నుంచి పోటీ చేశా. 33 వేల ఓట్లు సాధించా. పార్టీలోని కొందరు నాకు వ్యతిరేకంగా పనిచేయడంతో ఓటమి ఎదురైంది. విషయం చంద్రబాబు నాయుడికి తెలిసిన తర్వాత ఆయన సంబంధిత సదరు నాయకులను మందలించారు. ఓటమి తర్వాత కూడా ప్రజలతో నా సంబంధాలు తగ్గలేదు. పరకాల, శాయంపేట ప్రాంతాల్లోని పాఠశాలలకు 263 కంప్యూటర్లు అందించా. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు కొనసాగించా. ఓటమి వచ్చినప్పుడు ఇంట్లో కూర్చుంటే రాజకీయాల్లో నిలబడలేం. అందుకే మరింతగా ప్రజల్లోకి వెళ్లా."

### 'ఇంటింటికీ మీ చల్లా'తో ఏడాది పర్యటన

"2013 నవంబరు 22న 'ఇంటింటికీ మీ చల్లా' కార్యక్రమాన్ని ప్రారంభించా. దాదాపు ఏడాది పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తిరిగా. ఒక్కో గ్రామంలో మూడు రోజులపాటు ఉండి ప్రజల సమస్యలు తెలుసుకున్నా. రోడ్లు, తాగునీరు, విద్యుత్తు, డ్రైనేజీ, విద్య.. ఇలా ప్రతి అంశంపై ప్రజలతో మాట్లాడా. ఒక గ్రామంలో ఆకలితో పస్తులు పడుతున్న డిగ్రీ విద్యార్థినిని చూసిన ఘటన నన్ను తీవ్రంగా కలచివేసింది. ఆ పర్యటన వల్ల నియోజకవర్గానికి ఏం అవసరమో నాకు పూర్తిగా అర్థమైంది. 2014లో టీడీపీ నుంచి పరకాల ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచా. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కార్యకర్తల కోరిక మేరకు టీఆర్ఎస్‌లో చేరా. కేసీఆర్‌తో నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. కేసీఆర్ భోళాశంకరుడు. మాట ఇస్తే నిలబెట్టుకునే నాయకుడు. మంచి విజన్ ఉన్న వ్యక్తి. నాపై ఆయనకు ప్రత్యేక అభిమానం ఉండేది. ఆయనతో నాకు ఉన్న అనుబంధం వల్ల కేటీఆర్, హరీశ్‌రావులతోనూ మంచి సంబంధాలు ఏర్పడ్డాయి. నేను వ్యక్తిగత విమర్శలకు వెళ్లను. రాజకీయ ప్రత్యర్థులను రాజకీయంగానే ఎదుర్కొంటా.

### 'మళ్లీ బరిలో ఉంటా.. కార్యకర్తల కోసమే'

"గత ఎన్నికల్లో గెలిస్తే రాజకీయాలకు కొంత విరామం ఇవ్వాలని అనుకున్నా. కానీ ఇప్పుడు కనిపిస్తున్న కక్షపూరిత రాజకీయ వాతావరణం, నన్ను నమ్ముకున్న కార్యకర్తల పరిస్థితి చూసి మళ్లీ పోటీ చేయాలని నిర్ణయించుకున్నా. గత ఎన్నికల్లో జరిగిన తప్పులను గుర్తించా. వాటిని సరిదిద్దుకుంటా. నియోజకవర్గ సరిహద్దులు మారినా నాకు ప్రజలతో ఉన్న సంబంధాలు మారవు. 109 గ్రామ పంచాయతీల్లో నాకు బలమైన పట్టు ఉంది. ఈసారి నా కోసం కాదు.. నన్ను నమ్ముకున్న కార్యకర్తల కోసం గెలవాలి. వాళ్లకు అండగా ఉండాలి. రాజకీయాల్లో నేను చూసింది గెలుపు మాత్రమే కాదు.. అవమానం, ఓటమి, పోరాటం, విజయం అన్నీ. అందుకే ఇప్పుడు వచ్చే ఎన్నికలను మరో సాధారణ ఎన్నికగా చూడటం లేదు. నన్ను నమ్ముకున్న వాళ్లకు ఇచ్చే సమాధానంగా చూస్తున్నా. ప్రజలు తప్పకుండా ఆదరిస్తారన్న నమ్మకం ఉంది. అందుకే మళ్లీ బరిలోకి దిగుతా అని చల్లా ధర్మారెడ్డి స్పష్టం చేశారు.

కాకతీయ,తెలంగాణ బ్యూరో/
- కిరణ్ గౌడ్ అరెల్లి
7396604266

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at
H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266